భూసమస్యల పరిష్కారానికే

రెవెన్యూ సదస్సులు

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాశ్వత భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సుల కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని దేవళంపేటలో జరిగే రెవెన్యూ సదస్సులకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో నూటికి 90 శాతానికి పైగా భూసమస్యలు ఉన్నాయని, భూసమస్యల పరిష్కారానికి ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రధానంగా భూఆక్రమణలు, 22ఏ భూముల అక్రమాలతో పాటు పలు రెవెన్యూ సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి ఆన్‌లైన్ చేయడంతో పాటు నిర్ణీత గడువులోగా సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలోని భూబాధితులందరూ రెవెన్యూ సదస్సుల్లో పాల్గొని తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. అధికారులందరూ ప్రజలతో గౌరవంగా ప్రవర్తిస్తున్నా స్థానిక రెవెన్యూ అధికారులు మాత్రం ప్రజల పట్ల అగౌరవంగా వ్యవహరిస్తున్నారని, కార్యాలయానికి వచ్చే అర్జీదారులు, రైతుల పట్ల గౌరవంగా మాట్లాడాలని మంత్రి హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా కంటే జిల్లాలోనే భూసమస్యలు అధికంగా ఉన్నాయని, కేవలం ఈ 20 రోజుల్లో 9 వేల అప్లికేషన్లు అన్నమయ్య జిల్లాలో వచ్చాయని తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు సైతం గ్రూపులు లేకుండా ప్రజలకు సేవ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్, తహసీల్దార్ నరసింహులు, ఇన్‌చార్జి ఎంపీడీవో శేఖర్‌నాయక్, సంబంధిత శాఖ అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఎంఐజీ లేఅవుట్ సిద్ధం చేయాలి

● జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



ఆరోగ్యవరం వద్ద ఎంఐజీ లేఅవుట్ స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ

మదనపల్లె టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె ప్రాంతంలో మధ్యతరగతి ప్రజలకు, ఉద్యోగులకు అందుబాటులో ఉండే విధంగా ఎంఐజీ లేఅవుట్‌ను సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్, పీకేఎం ఉడా వైస్ చైర్మన్ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. మంగళవారం స్థానిక పీకేఎం ఉడా కార్యాలయంలో సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌తో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తీసుకున్న విధివిధానాలకు అనుగుణంగా పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో లేఅవుట్లపై తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం మండలంలోని ఆరోగ్యవరం వద్ద ఇదివరకే కేటాయించిన ఎంఐజీ లేఅవుట్ స్థలాన్ని జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. అందరికీ ఆమోదయోగ్యంగా ఉన్న భూమిని ఎంఐజీ లేఅవుట్‌కు సేకరించి, అందులో ప్లాట్లు వేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఖాజాబీ, డీపీవో జకీరాబేగం, ఆర్ఐ శేషాద్రిరావు, పీకేఎం ఉడా సిబ్బంది పాల్గొన్నారు.

పీబీసీ లైనింగ్ పనులకు రూ.480 కోట్లు

● పరిపాలనా అనుమతి ఇచ్చిన ప్రభుత్వం

మదనపల్లె, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవాలో ప్రధానమైన పుంగనూరు బ్రాంచి కెనాల్ (పీబీసీ) లైనింగ్ పనులకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇందులోభాగంగా జీవో నెంబరు-434తో మంగళవారం పరిపాలన అనుమతి ఇచ్చింది. హంద్రీ-నీవా రెండో విడతలో 75.075 కి.మీ. నుంచి 189.80 కి.మీ. వరకు, అక్కడి నుంచి 207.800 కి.మీ. వరకు కుప్పం బ్రాంచికెనాల్‌లో కాంక్రీటు లైనింగ్ పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో మొదటి బిట్టులో లైనింగ్ పనులు, రెండో బిట్టులో లైనింగ్‌తో పాటు కాలువ మరమ్మతులు చేపట్టాలని అందులో సూచించింది. ఇదిలా ఉండగా గతంలో ఈ పనులు చేపట్టడానికి వైసీపీ ప్రభుత్వం 2020-21లో రూ.1,929 కోట్లతో టెండర్లు పిలిచింది. ఎన్‌సీసీ కంపెనీ టెండర్ దక్కించుకున్నా పనులు మాత్రం చేయలేదు. తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం విస్తరణ పనులు పక్కన పెట్టి కేవలం కాంక్రీటు లైనింగ్ పనులు మాత్రమే చేపట్టాలని నిర్ణయించింది. కానీ తాజాగా ఇచ్చిన ఉత్తర్వులో విస్తరణ పనులు రద్దు చేస్తున్నామనే మాట లేకుండా పనుల రకాన్ని మార్పు చేస్తున్నట్లు చెప్పింది. ఇందులో భాగంగా మొదట విస్తరణ పనుల కోసం కేటాయించిన రూ.1,929 కోట్లలో ప్రస్తుతం చేస్తున్న లైనింగ్ పనులకు రూ.480 కోట్లు వ్యయం చేయాలని పేర్కొంది. మరోవైపు విస్తరణ పనులు కేటాయించిన ఎన్‌సీసీ కంపెనీనే ఈ లైనింగ్ పనులు చేస్తుందని, లైనింగ్ పనులు చేయడం ద్వారా పీబీసీ సామర్థ్యం 145 క్యూసెక్కుల నుంచి 280 క్యూసెక్కులకు పెరుగుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

వెలిగల్లు కాలువకు లైనింగ్ చేయని దృశ్యం



ముదివేడు రిజర్వాయర్ (ఫైల్)



గత ఐదు సంవత్సరాల జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సాగునీటి రంగంపై పూర్తిగా నిర్లక్ష్యం వహించింది జిల్లాలో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయలేదు. కొట్టుకుపోయిన వాటిని పునర్ నిర్మించే పనులు చేపట్టలేదు. పూర్తయిన ప్రాజెక్టులకు కాలువలు నిర్మించలేదు. దెబ్బతిన్న వాటిని మరమ్మతులు చేసేందుకు నిధులు కేటాయించలేదు. తమ హయాంలో కొత్తగా కనీసం ఎకరాకు నీళ్లు ఇచ్చే పనులూ చేపట్టలేదు. ఎన్నికల ఏడాదైనా.. కనీసం ఓట్ల కోసమైనా.. నిధులు కేటాయిస్తారని ఆశించిన జిల్లా ప్రజలకు నిరాశే మిగిలింది.

సాగునీటి ప్రాజెక్టులకు సున్నా...



కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్టు (ఫైల్)

రౌండప్ 2024

- ఎన్నికల ఏడాదిలో కూడా పైసా విదిల్చని వైసీపీ ప్రభుత్వం
- 'అన్నమయ్య' కొట్టుకుపోయి మూడేళ్లు..
- నిర్మాణానికి ఇంకెన్నేళ్లో..?
- ముదివేడు రిజర్వాయర్ కథ ఇక కంచికే..
- అసంపూర్తిగా హంద్రీ-నీవా పనులు
- ఝురికోనకు కాలువలే లేవు..
- వెలిగల్లు కాలువలకు మరమ్మతులు లేవు
- వైసీపీ విధ్వంస పాలన..

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ఏ ప్రభుత్వమైనా ఎన్నికల ఏడాదిలో ప్రజలకు ఉపయోగపడే పనులకు ఎక్కువగా నిధులు కేటాయిస్తారు. కానీ వైసీపీ ప్రభుత్వం మాత్రం సాగునీటి ప్రాజెక్టులను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికలకు ముందు కూడా ఏ ఒక్క ప్రాజెక్టుకు పైసా ఇవ్వలేదు. మూడు సంవత్సరాల క్రితం కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్టు పునర్ నిర్మాణానికి పైసా విదిల్చలేదు. ముదివేడు రిజర్వాయర్ పనులు ఎటువంటి అనుమతులు లేకుండా అడ్డగోలుగా చేపట్టడమే కాకుండా భూములు కోల్పోయిన నిర్వాసితులకు పైసా నష్టపరిహారం ఇవ్వలేదు. 15 సంవత్సరాల క్రితం నిర్మాణం పూర్తయిన ఝురికోన ప్రాజెక్టు కాలువల నిర్మాణానికి ఎటువంటి అడుగు ముందుకు వేయలేదు. నిర్మాణం పూర్తయి ప్రజలకు అందుబాటులో ఉన్న వెలిగల్లు ప్రాజెక్టు కాలువల మరమ్మతులకు తగినన్ని నిధులు కేటాయించలేదు. జిల్లాలో దాదాపు 80 శాతానికి పైగా పూర్తయిన హంద్రీ-నీవా ప్రాజెక్టు కాలువల నిర్మాణ పనులకు తట్టెడు మట్టి ఎత్తలేదు. దీంతో వైసీపీ పాలనలో ఎకరం తడిపే ప్రాజెక్టు జిల్లాలో లేదనే ఆవేదన రైతుల్లో నెలకొంది. ఈ ఏడాది ఎన్నికలు జరిగిన మే వరకు అధికారంలో ఉన్న జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు సమాధి కట్టిందనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఈ ఏడాది వైసీపీ ప్రభుత్వ నిర్వాహకం వల్ల జిల్లాలో రైతులకు తీరని నష్టం వాటిల్లింది. ఏడు నెలల కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల కాలంలోనే హంద్రీ-నీవాలో ప్రధానమైన పుంగనూరు బ్రాంచి కెనాల్(పీబీసీ) లైనింగ్ పనులకు రూ.480 కోట్లతో మంగళవారం ప్రభుత్వం జీవో నంబర్-434తో పరిపాలన అనుమతి ఇచ్చింది. అలాగే అసంపూర్తిగా ఉన్న సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున నిధులు కేటాయించాలని జిల్లా రైతాంగం కోరుతోంది.

అటకెక్కిన హంద్రీ-నీవా పనులు

జగన్‌మోహన్‌రెడ్డి హంద్రీ-నీవా సుజల స్రవంతి కోసం ఏమాత్రం నిధులు కేటాయించలేదనే విమర్శలు ఉన్నాయి. దీంతో హంద్రీ-నీవా సాగునీటి కాలువలు నిరుపయోగంగా ఉన్నాయి. వర్షాకాలంలో వర్షాలకు కాలువలకు గండ్లు పడ్డా తెగిపోయినా మరమ్మతులు చేయలేదు. గాలేరు-నగిరి సుజల స్రవంతి పథకంలో భాగంగా గండికోట జలాలను నియోజకవర్గానికి తీసుకొచ్చేందుకు చేపట్టిన పనుల్లో పెద్దమండ్యెం, ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం మండలాల్లో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వలేదు.

అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి మూడేళ్లు

2021 నవంబరులో అప్పటి వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల వరదల్లో కొట్టుకుపోయింది. 40 మందికి పైగా మృత్యువాతపడ్డారు. వేలాది పశువులు వరదలో కొట్టుకుపోయాయి. వేల ఎకరాల్లో పంట దెబ్బతింది. వందల కోట్ల రూపాయల ఆస్తినష్టం సంభవించింది. ప్రాజెక్టు కొట్టుకుపోయిన తర్వాత సుమారు మూడు సంవత్సరాల పాటు జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్నారు. అయినా ఈ ప్రాజెక్టు పునర్ నిర్మాణం కోసం పైసా నిధులు ఖర్చు చేయలేదు. ఎన్నికలకు ముందు ప్రజల చెవుల్లో పూలు పెట్టేందుకు రూ.700 కోట్లతో ప్రాజెక్టు నిర్మిస్తామని, టెండర్లు పూర్తయ్యాయని కల్లబొల్లి మాటలతో కబుర్లు చెప్పారు. ఇళ్లు కోల్పోయిన బాధితులకు కనీసం ఇళ్లు కూడా కట్టించలేదు. ఈ ప్రాజెక్టు పూర్తయితే రాజంపేట నియోజకవర్గంలో పలు మండలాలకు సాగునీటితో పాటు తాగునీరు అందుతుంది. పలు చెరువులకు నీళ్లు అందుతాయి. అయితే ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యేది ఎప్పటికో? అని ఈ ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు.

పింఛా ఇంకా అసంపూర్తిగానే...

అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయిన రోజే పింఛా ప్రాజెక్టు కూడా కొట్టుకుపోయింది. ప్రస్తుతానికి ఈ ప్రాజెక్టు పునర్ నిర్మాణం పూర్తయింది. రూ.83.33 కోట్లతో పనులు చేపట్టారు. దాదాపు 95 శాతం పనులు పూర్తయ్యాయి. కాంట్రాక్టర్ బిల్లుల కోసం ఎదురు చూపులు చూస్తున్నారని సమాచారం. ఈ ప్రాజెక్టులో నీళ్లు ఉంటే సుండుపల్లె మండలంలోని ముడుంపాడు, మాచిరెడ్డిగారిపల్లె, రాయవరం, పెద్దినేనికాలువ గ్రామాల్లో సుమారు 12 చెరువులకు నీళ్లు అందుతాయి. పలు గిరిజన తాండాలకు సాగునీరు అందుతుంది. గత మూడు సంవత్సరాలుగా పింఛా ప్రాజెక్టు వల్ల ఈ ప్రాంత రైతులకు ఎటువంటి ఉపయోగం కలగలేదు.

వెలిగల్లు కాలువల కంటే జల్లెడ నయం

గాలివీడు మండలంలో ఉన్న వెలిగల్లు ప్రాజెక్టు కుడి కాలువ సుమారు 52 కిలోమీటర్లు ఉంది. దీని కింద 23,400 ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రాజెక్టు పూర్తయి 16 సంవత్సరాలు అవుతున్నా ఇప్పటి వరకు ఒకసారి కూడా చివరి ఆయకట్టుకు నీళ్లు అందలేదు. ఈ కాలువకు పలుచోట్ల గండ్లు పడ్డాయి. గత ప్రభుత్వం నిధుల కేటాయింపులో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేయకుండానే మధ్యలో వదిలి వెళ్లిపోయారు. 52 కిలోమీటర్ల కాలువకు గాను 15 కిలోమీటర్లు మాత్రమే లైనింగ్ వేశారు. దీంతో చివరి ఆయకట్టుకు కనీసం 25 శాతం కూడా నీళ్లు అందడం లేదు. అదేవిధంగా పిల్ల కాలువలకు మరమ్మతులు చేయలేదు. ఫలితంగా వెలిగల్లు ప్రాజెక్టు ఉన్నా ఉపయోగం అంతంతే అన్నట్లుగా ఉంది.

సర్వే దశలోనే ఝురికోన కాలువలు

ఎప్పుడో పదిహేను సంవత్సరాలకు పూర్వం పూర్తయిన ఝురికోన ప్రాజెక్టుకు ఇంకా కాలువలు సర్వే దశలోనే ఉన్నాయి. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణం తర్వాత ముఖ్యమంత్రిగా రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, చంద్రబాబునాయుడు, జగన్‌మోహన్‌రెడ్డిలు పని చేశారు. అయినా ఇప్పటికీ ఈ ప్రాజెక్టు కాలువలకు మోక్షం కలగలేదు. ఈ ప్రాజెక్టుకు కాలువలు పూర్తయితే సుండుపల్లె, సంబేపల్లె, కేవీ పల్లె మండలాల రైతాంగానికి ఎంతో కొంత ఉపయోగం కలుగుతుంది. సంబేపల్లె మండలంలో సరైన సాగునీటి వసతి లేని గ్రామాలకు ఈ ప్రాజెక్టు నుంచి నీళ్లు అందించవచ్చు.

శ్రీనివాసపురం రిజర్వాయర్ ఉన్నా.. లేనట్లే..

చిన్నమండెం మండలంలో నిర్మించిన శ్రీనివాసపురం రిజర్వాయర్ (మండిపల్లె నాగిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్) వల్ల రైతులకు ఎటువంటి ఉపయోగం లేదని స్థానికులు వాపోతున్నారు. రిజర్వాయర్ పూర్తయినా ఇప్పటికీ పూర్తి స్థాయిలో కాలువల నిర్మాణం జరగలేదు. దీంతో ఈ రిజర్వాయర్ నుంచి కాలువలకు నీళ్లు వదిలే అవకాశం లేదు. ఫలితంగా ఈ రిజర్వాయర్ వల్ల ప్రస్తుతానికి ఎటువంటి ఉపయోగం లేదని రైతులు వాపోతున్నారు. ఈ రిజర్వాయర్ కాలువలు నిర్మాణం జరిగితే సంబేపల్లె, రాయచోటి మండలాలకు సాగునీరు అందుతుంది.

ముదివేడు రిజర్వాయర్ కథ ఇక కంచికే

వైసీపీ ప్రభుత్వ హయాంలో తంబళ్లపల్లె నియోజకవర్గం కురబలకోట మండలం ముదివేడు వద్ద సుమారు రూ.700 కోట్ల వ్యయంతో రిజర్వాయర్‌ను నిర్మించారు. ఇప్పటికి సుమారు 90 శాతం పనులు పూర్తయ్యాయి. ఇందులో విశేషమేంటంటే ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ఎటువంటి అనుమతులు లేవు. నిర్మాణం కోసం సుమారు వేయి ఎకరాల వరకు భూములను రైతుల నుంచి పైసా పరిహారం ఇవ్వకుండానే లాక్కున్నారు. దీంతో ప్రస్తుతం ఆ రైతులు అటు నష్టపరిహారం రాక ఇటు సాగు చేసుకోవడానికి భూములు లేక.. రెంటికీ చెడ్డ రేవులా ఇబ్బంది పడుతున్నారు. ఇక ఈ ప్రాజెక్టు కథ కంచికే ? అనే అనుమానాలు రైతులు వ్యక్తం చేస్తున్నారు.

వ్యవసాయాధారిత జిల్లాలో ఇప్పటికే సరైన సాగునీటి వనరులు లేవు. ప్రధానంగా వర్షాధారంగానే పంటలు పండించుకోవాలి. ఇటువంటి నేపథ్యంలో వైసీపీ పాలనలో సాగునీటి ప్రాజెక్టులపైన పూర్తి స్థాయిలో శీతకన్ను వేయడంతో రైతులకు తీరని నష్టం వాటిల్లింది. ఏడు నెలల కిందట ఏర్పడిన తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఇప్పటికీ సాగునీటి ప్రాజెక్టుల కోసం పైసా నిధులు కేటాయించలేదు. రాబోయే రోజుల్లో తగినన్ని నిధులు కేటాయించి పనులు పూర్తయ్యేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

శభాష్... డాక్టర్ వెంకటరామయ్య

- రోడ్డు ప్రమాదంలో ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లిన యువకుడు
- సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన వైద్యుడు

6

ఉద్రిక్తతల నడుమ సమావేశం



- టీడీపీ, వైసీపీ నేతల మధ్య తోపులాట
- ఇరువురికి గాయాలు

7

బీఎల్‌వోలకు తీపి కబురు !

- ఒక్కొక్కరికి రూ.12,750 వంతున విడుదల చేసిన ప్రభుత్వం
- 2021 నుంచి చెల్లించని వైసీపీ ప్రభుత్వం
- బీఎల్వోలందరికీ లబ్ధి

6

విద్యుద్దీపాలతో శోభిల్లుతున్న జాకబ్ చాంబర్లిన్ చర్చి



ఆరోగ్యవరం వద్ద సెయింట్ ల్యూక్స్ చర్చి





గుడిసివారిపల్లె వద్ద సెయింట్ జాన్స్ చర్చి

విద్యుద్దీపకాంతుల్లో చర్చిలు

● నేడు క్రిస్మస్ పండుగ

మదనపల్లెటౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవానికి పేరొందిన మదనపల్లె ప్రాంతంలో పలు చర్చిలు క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ముస్తాబు చేశారు. మదనపల్లె పట్టణంలోని జాకబ్ చాంబర్లిన్ చర్చి, మండలంలోని ఆరోగ్యవరం వద్ద ఉన్న సెయింట్ ల్యూక్స్ చర్చి, గుడిసివారిపల్లె వద్ద ఉన్న సెయింట్ జాన్స్ చర్చిలు రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. దీంతో పాటు క్రిస్మస్ ట్రీలు, స్టార్‌ల ఆకారంలో విద్యుత్ దీపాలంకరణ చేశారు. కాగా పట్టణంలోని పలు దుకాణాల్లో క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవులు పలురకాల వస్తువులు కొనుగోలు చేస్తున్నారు. ముఖ్యంగా క్రైస్తవులు అధికంగా ఉన్న నెహ్రూనగర్, శేషప్పతోట, ఆరోగ్యవరం, గుడిసివారిపల్లె, ఆరోగ్యమాత చర్చి ప్రాంగణాల్లో క్రిస్మస్‌కు రెండు రోజులు ముందుగానే పండుగ వాతావరణం నెలకొంది. మదనపల్లె మండలంలో వందేళ్లు పైబడిన జాకబ్‌చాంబర్లీన్ చర్చి, సెయింట్ జాన్స్ చర్చి ఎదుట ప్రత్యేక అలంకరణలు చేశారు.

సామాజిక సేవలో క్రైస్తవ మిషనరీలు

- విద్య,వైద్యమే ప్రామాణికంగా సామాజిక సేవలు
- చిరస్మరణీయుడు జాకబ్ చాంబర్లీన్



సీఎస్ఐ బాలికల ఉన్నత పాఠశాల


జాకబ్ చాంబర్లీన్

మదనపల్లె అర్బన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవ మిషనరీలు విద్య, వైద్య, ఆధ్యాత్మికంగా మదనపల్లెకు ఎనలేని సేవలు అందిస్తున్నాయి. ఈ మిషనరీలు ప్రజలకు ఎంతో ఉపయోగమైన పనులు చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నాయి. మదనపల్లె పట్టణాన్ని అన్ని రంగాల్లో ముందుకు నడిపిన ఆద్యుడు అమెరికాకు చెందిన డాక్టర్ జాకబ్ చాంబర్లీన్. అమెరికన్ ఆర్కాట్ మిషనరీ ఆధ్వర్యంలో 1860లో క్రైస్తవ మతం వ్యాప్తికి మదనపల్లెకు వచ్చారు. ఆయన స్వతహాగా వైద్యుడు. ఇందులో భాగంగానే గాంధీ రోడ్డులో 1861లో మిషన్ కాంపౌండ్ నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం జిల్లా ఆస్పత్రి ఉన్న స్థలంలో 1863లో చిన్న వైద్యశాలను ఏర్పాటు చేసి ఎంతోమంది నిరుపేదలకు ఉచితంగా వైద్యం అందించారు. దీంతో ఈ ప్రాంతంలో ఆయనకు మంచి పేరు ప్రఖ్యాతులు రావడంతో 1865లో తొలి క్రైస్తవ సంఘాన్ని ఏర్పాటు చేశారు. స్థానికంగా ఉన్న మిషన్ కాంపౌండ్‌లో సంఘాలు సమావేశం కావడానికి జ్ఞానోదయ క్షేత్రం ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడే మొదటిసారి క్రైస్తవ సువార్త కూటములు నిర్వహించారు. ఈ క్షేత్రాన్ని ఇప్పుడు పార్కుగా తయారు చేశారు. ఇప్పుడు కూడా క్రిస్మస్ పండుగ సందర్భంగా ఇక్కడ సమావేశాలు ఏర్పాటు చేస్తారు. 1901లో విద్య, వైద్యంతో పాటు ఆధ్యాత్మికతను జోడిస్తూ జేసీఎం చర్చిని నిర్మించారు.

113 ఏళ్లుగా వైద్య సేవలు

స్థానికంగా గాంధీ రోడ్డులోని ఎంఎల్ఎల్ ఆస్పత్రిని 1911లో క్రైస్తవ మిషనరీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఇది గోషా ఆస్పత్రిగా పేరు పొందింది. మిషనరీల ఆధ్వర్యంలో అప్పట్లో అమెరికా నుంచి పలువురు బ్రిటీష్ వారు వచ్చి వైద్యం అందించేవారు. డాక్టర్లు ఇక్కడే నివాసం ఉండి మదనపల్లెలోనే కాకుండా పరిసర ప్రాంతాల్లో వారికి వైద్యసేవలను అందించేవారు. ఎంతో మంది మదనపల్లె పరిసర ప్రాంతాల నుంచి గోషా ఆస్పత్రికి వచ్చి చికిత్సలు చేసుకునేవారు. ఇప్పుడు ఈ ఆస్పత్రి రాయలసీమ మిషనరీ ఆధ్వర్యంలో నడుస్తోంది. కాలానుగుణంగా వైద్య సేవల్లో వెనుకబడింది.

క్షయ నివారణకు ఆరోగ్యవరం మెడికల్ సెంటర్

క్రైస్తవ మిషనరీల ఆధ్వర్యంలోనే ఆరోగ్యవరంలో 1911లో సుమారు 170 ఎకరాల్లో ఆరోగ్యవరం మెడికల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో క్షయ చికిత్సకు కొత్త రకాల మందుల పరిశోధనలకు ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ ఎన్నో సేవలను అందించింది. దీంతో పాటు క్రైస్తవ మత వ్యాప్తి కోసం ఆరోగ్యవరంలో 1935లో సెయింట్ లూక్స్ చర్చిని, 1905లో గుడిసివారిపల్లెలో సెయింట్ పీటర్ చర్చిని నిర్మించారు. ఇవి ప్రస్తుతం రాయలసీమ డయాసిస్ బిషప్ ఆధీనంలో నడుస్తున్నాయి.

చాంబర్లిన్ సేవలు అమోఘం

క్రైస్తవ మత వ్యాప్తి కోసం ప్రజల్లో చైతన్యం తీసుకురావాలంటే వారు ఆరోగ్యంగా ఉంటూ విద్యను అభిసించినవారుగా ఉండాలన్న ఆలోచనలతోనే డాక్టర్ చాంబర్లీన్ సామాజికంగా విద్య, వైద్యం, ఆధ్యాత్మికంగా చేసిన సేవలు చిరస్మరణీయం. ఆ కాలంలో పేదలకు వైద్యం చాలా అవసరం దీనికంటే విద్య ఆవశ్యకతను గుర్తించిన డాక్టర్ చాంబర్లీన్ పాఠశాలను ఏర్పాటు చేసి పేదలకు విద్యను నేర్పేందుకు ఎనలేని సేవలు చేశారు.

- రెవరెండ్ డాక్టర్ సునీల్‌వరకుమార్,
డివిజన్ సంఘ కాపరి



ఎంఎల్ఎల్ ఆస్పత్రి



మిషన్ కాంపౌండ్‌లో చాంబర్లీన్ స్థూపం

విద్యారంగానికి 144 ఏళ్లుగా సేవలు

మదనపల్లె పరసర ప్రాంతాల ప్రజలకు ఉచితంగా విద్యను అందించాలన్న ఉద్దేశ్యంతో జాకబ్ చాంబర్లీన్ విద్యారంగానికి ఎనలేని సేవలు చేశారు. స్థానిక చిత్తూరు బస్టాండ్‌లో 1880లో సీఎస్ఐ బాలికల ఉన్నత పాఠశాలను అందుబాటులోకి తెచ్చారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎంతోమందికి ఉచితంగా విద్యను అందిస్తోంది. అలాగే పట్టణంలోని అవెన్యూ రోడ్డులో 1881లో హోప్ ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేశారు. అప్పట్లో అధికంగా పేద విద్యార్థులు ఈ రెండు పాఠశాలల్లో చదువుకున్నారు. చదువుకోవడానికి పుస్తకాల కోసం లైబ్రరీని ఏర్పాటు చేశారు. జాకబ్ చాంబర్లీన్ ఆంగ్ల సాహితీవేత్త. లైబ్రరీ ఏర్పాటుకు ఆయన ఎంతో కృషి చేశారు. లైబ్రరీ ఉండడంతో ఈ ప్రాంతాన్ని ఇప్పటికీ రీడింగ్‌రూమ్ వీధిగా పిలుస్తున్నారు.

ముంపు సమస్యను ప్రభుత్వానికి నివేదిస్తాం : జేసీ


సోమశిల వెనుకజలాలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ అదితిసింగ్

ఒంటిమిట్ట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సోమశిల ప్రాజెక్టు కింద ముంపునకు గురయ్యే పెన్నపేరూరు గ్రామ ప్రజల సమస్యలను ప్రభుత్వానికి నివేదిస్తామని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ తెలిపారు. మంగళవారం పెన్నపేరూరు, తప్పెటవారిపల్లె గ్రామాలను ఆమె సందర్శించారు. ముందుగా ఇబ్రహీంపేటలో ఉన్న రహదారులను పరిశీలించి గ్రామాల్లోకి ఎంతవరకు నీరు వస్తుందన్న అంశంపై సోమశిల ఇంజనీరింగ్ అధికారులను ఆరా తీశారు.

అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన హద్దులను పరిశీలించారు. గ్రామస్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ జనాభా, ఇతర వివరాలను స్థానిక రెవెన్యూ అధికారులను అడిగి అని తెలుసుకున్నారు. పరిహారం కోసం పేర్లు నమోదు చేశారా అని సోమశిల ఇంజనీరింగ్ అధికారులను ప్రశ్నించగా, ఇప్పటివరకు ఎలాంటి నమోదు చేయలేదని సమాధానమిచ్చారు. ఈ సమస్యపై కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామని, అనంతరం ఓ సమావేశాన్ని ఏర్పాటు చేసి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో జాన్ ఎర్విన్, స్పెషల్ కలెక్టర్ శ్రీనివాసులు, సోమశిల ఎస్ఈలు వెంకటేశ్వర్‌రెడ్డి, రమణారెడ్డి, తహసీల్దారు వెంకట రమణమ్మ, ఆర్ఐ భాస్కర్‌రెడ్డి, వీఆర్వో అంజి, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణపై విచారణ

మండలంలోని ఓబులేశుకోనలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములపై జేసీ అదితి సింగ్ విచారణ చేశారు. మండల పరిధిలోని పెన్నపేరూరు రెవెన్యూ పరిధిలో ఉన్న ఓబులేశుకోనలో దాదాపు 120 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారి వివరాలను తెలపాలని తహసీల్దారు రమణమ్మను ప్రశ్నించగా. దాదాపు 10 నుంచి 20 మంది ఆక్రమించారని ఆయన సమాధానమిచ్చారు. సరైన వివరాలు తెలపాలంటూ తహసీల్దారుతోపాటు ఆర్డీవో జాన్‌ఎర్విన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆక్రమణదారులను రైతులని చెప్పడం ఏమిటని ఆమె ప్రశ్నించారు.

బీఎల్‌వోలకు తీపి కబురు!

- ఒక్కొక్కరికి రూ.12,750 వంతున విడుదల చేసిన ప్రభుత్వం
- 2021 నుంచి చెల్లించని వైసీపీ ప్రభుత్వం
- బీఎల్వోలందరికీ లబ్ధి

కలికిరి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రానున్న పండుగల వేళ బీఎల్‌వోలకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. రెండేళ్లుగా పేరుకుపోయిన బకాయిలను ఏకమొత్తంగా (డిసెంబరు వరకు) విడుదల చేస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో దాదాపు 1500 మంది బీఎల్‌వోలు (బూత్ లెవెల్ ఆఫీసర్లు) లబ్ధి పొందనున్నారు. ఒక్కో బీఎల్‌వోకు రూ.12,750 అందనున్నాయి. నేరుగా ఎన్నికల సంఘం రాష్ట్ర సీఈవో అజమాయిషీలో పనిచేస్తూ ఓటర్ల జాబితాల తయారీ నుంచి ఓటరు స్లిప్పుల పంపిణీ వరకు ఎన్నికల నిర్వహణలోనూ, పోలింగ్ సమయంలోనూ కీలకమైన విధులు నిర్వర్తిస్తున్న బీఎల్‌వోలకు గత ప్రభుత్వం రెండేళ్లకు పైబడి గౌరవ భృతి చెల్లించకుండా తాత్సారం చేసింది. అయినా గత సార్వత్రిక ఎన్నికల వరకు వీరు ఆర్థిక ప్రయోజనాలను పట్టించుకోకుండా బాధ్యతాయుతమైన విధులు నిర్వర్తించడంలో తలమునకలుగా పనిచేశారు. ఎన్నికలు పూర్తయిన తరువాత ఇప్పుడు మళ్లీ ఓటర్ల జాబితాల సవరణ బాధ్యతల్లో కొనసాగుతున్నారు. నాలుగేళ్ల క్రితం వరకూ బూత్ లెవెల్ ఆఫీసర్లుగా అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. అప్పట్లో బీఎల్‌వో బాధ్యతలు నిర్వర్తించినందుకు నెలకు రూ.250 చెల్లించేవారు. అదీ ఏడాదికో, రెండేళ్లకో నిధులు విడుదలయ్యేవి. 2022 జనవరి నుంచి ఈ గౌరవ భృతిని నెలకు రూ.500గా ఎన్నికల కమిషన్ పెంచింది. పేరుకు పెంచారేగానీ 2021 అక్టోబరు నుంచి ఈ గౌరవ భృతి కూడా చెల్లించడం లేదు. సచివాలయ వ్యవస్థ అందుబాటులోకి వచ్చిన అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలకు బదులుగా సచివాలయ ఉద్యోగులను నియమించారు. ఏళ్ల తరబడి పాతదిగానీ, కొత్తగా పెంచిన గౌరవ భృతి కానీ చెల్లించకపోవడంతో బీఎల్వోలు కూడా వెట్టిచాకిరీ చేస్తున్నామనే నైరాశ్యంతోనే పనిచేస్తూ వచ్చారు. అనూహ్య రీతిలో 2021 నుంచి 2024 డిసెంబరు వరకూ ఉన్న బకాయిలను ప్రభుత్వం తాజాగా విడుదల చేసింది.

మంగళవారం విడుదలైన ప్రభుత్వం ఉత్తర్వుల ప్రకారం ప్రతి బీఎల్వోకూ 2021-22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మూడవ త్రైమాసికానికి (అక్టోబరు, నవంబరు, డిసెంబరు మూడు నెలలకు) నెలకు రూ.250 ప్రకారం రూ.750 చెల్లించాలి. ఆ తరువాత అదే సంవత్సరం నాలుగవ త్రైమాసికం (2022 జనవరి, ఫిబ్రవరి, మార్చి) నుంచి 2023-24 మూడవ త్రైమాసికం వరకు నెలకు రూ.500 ప్రకారం మొత్తం రూ.12,750లు చెల్లించనున్నారు. ఈ మేరకు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వివేక్ యాదవ్ మంగళవారం జీవో జారీ చేశారు.

ఎర్రచందనం స్మగ్లర్ అరెస్టు



ఒంటిమిట్ట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్న స్మగ్లర్‌ను ఒంటిమిట్ట పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఎస్ఐ శివప్రసాద్ తెలిపిన వివరాల మేరకు 2023లో ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో నిందితుడైన బద్వేలుకు చెందిన పెరుగు లక్ష్మీనరసయ్య అప్పటి నుంచి తప్పించుకు తిరుగుతున్నాడు. మంగళవారం అతడిని అరెస్టు చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి, రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

సబ్సిడీతో సోలార్ రూఫ్‌టాప్


సమావేశంలో మాట్లాడుతున్న అన్నమయ్య జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ రమణ

రాయచోటిటౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సబ్సిడీతో ఎస్సీ, ఎస్టీ వినియోగదారుల గృహాల ఇంటి పైకప్పు మీద సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసేందుకు ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందని జిల్లా విద్యుత్‌శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ రమణ తెలిపారు.

మంగళవారం రాయచోటి పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో జిల్లా విద్యుత్‌శాఖ అధికారులు, నెడ్‌క్యాప్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం గృహ వినియోగదారులకు మాత్రమే వర్తిస్తుందని తెలిపారు. ఈ పథకం ద్వారా గృహ వినియోగదారులకు ప్రభుత్వం సబ్సిడీ రాయితీని మంజూరు చేస్తుందని తెలిపారు. ఇంటిపైప్పుపైన కనీసం 10 చదరపు మీటర్ల 100 చదరపు అడుగుల స్థలంలో 1 కిలో వాట్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేయవచ్చునన్నారు. దీనికోసం వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకుని రాయితీ ద్వారా సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు.

జిల్లాలో 43,730 మంది ఎస్సీ వినియోగదారులు, 11,872 మంది ఎస్టీ వినియోగదారులతో కలిపి మొత్తం 55,602 మంది ఎస్సీ, ఎస్టీ వినియోగదారులు ఉన్నారన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జనవరి 10వ తేదీలోపు ఎస్సీ, ఎస్టీ వినియోగదారుల నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు లక్ష్యాన్ని నిర్దేశించుకుని పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ వినియోగదారులు ఎటువంటి రుసుం లేకుండా ఉచితంగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. సమావేశంలో విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, నెడ్‌క్యాప్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ యల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శభాష్... డాక్టర్ వెంకటరామయ్య

- రోడ్డు ప్రమాదంలో ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లిన యువకుడు
- సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన బి.కొత్తకోట వైద్యుడు


సీపీఆర్ చేస్తున్న డాక్టర్ వెంకటరామయ్య


సీపీఆర్‌తో కోలుకుంటున్న విద్యార్థి అనిల్


ములకలచెరువు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట ప్రభుత్వాస్పత్రి వైద్యుడు డాక్టర్ వెంకటరామయ్య ఓ ప్రాణాన్ని నెలబెట్టారు. రోడ్డు ప్రమాదానికి గురై ప్రాణాపాయ స్థితికి వెళ్లిన యువకుడిని సీపీఆర్ చేసి కాపాడారు. యువకుడి ప్రాణాలు కాపాడి ఆదర్శంగా నిలిచిన వైద్యుడిని ప్రజలు ప్రశంసించి అభినందనలు తెలుపుతున్నారు. వివరాల్లోకి వెళితే... ములకలచెరువు మండలం కోనేటివారిపల్లెకు చెందిన యువకుడు అనిల్ (22) బీటెక్ చదువుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ద్విచక్రవాహనంలో వెళ్తుండగా ముంబాయి-చెన్నై జాతీయ రహదారిలోని అన్నమయ్య-శ్రీసత్యసాయి జిల్లాల సరిహద్దు సమీపంలో ఉన్న తనకల్లు మండలం చీకటిమానిపల్లె వద్ద మదనపల్లె నుంచి కదిరి వైపు వెళుతున్న లారీ ఢీకొని రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ ప్రమాదంలో యువకుడు తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరాడు. ఈ సమయంలో పని నిమిత్తం శ్రీసత్యసాయి జిల్లా కదిరికి ద్విచక్ర వాహనంలో వెళ్లి వస్తున్న బి.కొత్తకోట ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న డాక్టర్ వెంకటరామయ్య యువకుడి వద్దకు వచ్చారు. యువకుడు ఊపిరి తీసుకోవడం ఆపేస్తుండడాన్ని గమనించి వెంటనే సీపీఆర్ చేసి ప్రాణం పోశారు. అలాగే 108కు ఫోన్ చేసి చికిత్స నిమిత్తం తనకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం యువకుడి ఆరోగ్యం కుదుటపడుతోంది. డాక్టర్ వెంకటరామయ్య యువకుడి పాలిట దేవుడిగా వచ్చి ప్రాణం పోశారని అక్కడున్న వారు అభినందించారు.

మల్చింగ్ షీట్‌తో బొప్పాయి సాగు..

ఆదాయం బాగు

- భూమిలోని తేమ త్వరగా ఆవిరి కాకుండా చేస్తుంది
- సూక్ష్మజీవులను నశింపజేయడం వంటి లాభాలు

మల్చింగ్ షీట్ వస్తూనే సమాచారం ఇస్తాం



మల్చింగ్ షీట్ సబ్సిడీతో వస్తూనే రైతులకు సమాచారం అందిస్తాము. ప్రస్తుతం సబ్సిడీలు వస్తాయని ఆశిస్తున్నాము. రైతులు మల్చింగ్ షీట్‌పై మక్కువ చూపుతున్నారు. చాలామంది రైతులు వీటిని అడుగుతున్నారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపుతాము.

- భాస్కర్, రైల్వేకోడూరు ఉద్యానశాఖాధికారి

మొదటిసారి వేశాము



బొప్పాయి సాగుకు మల్చింగ్ షీట్‌ను మొదటిసారి వేశాము. లాభాలు ఉన్నాయని చాలామంది రైతులను ఆదర్శంగా తీసుకుని వేశాము. ఉద్యానశాఖ అధికారులు సూచనలు, సలహాలతో పాటు కొందరు మల్చింగ్ షీట్ వేసిన రైతులను అడిగి ఎలా వేయాలో తెలుసుకుని సాగు చేపట్టాము.

- మన్నూరు తేజ, రైతు, ఓబనపల్లె

రైల్వేకోడూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మల్చింగ్ షీట్‌తో బొప్పాయి సాగును చాలామంది రైతులు చేస్తున్నారు. గతంలో అన్ని ఉద్యాన పంటల మాదిరిగానే సాధారణంగా బొప్పాయిని రైతులు సాగు చేసే వారు. తీవ్ర కలుపు మొక్కలతో రైతులు కూలీలు పెట్టి తొలగించేవారు. కూలీలు దొరకని సమయంలో మినీ ట్రాక్టర్‌తో తొలగించే వారు. ఇది పెద్ద ఖర్చుతో కూడుకున్నదని రైతులు పలు ఇబ్బందులు పడేవారు. అయితే రానురాను వ్యవసాయ రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా రైతులు బొప్పాయి సాగును వినూత్నంగా మల్చింగ్ షీట్‌తో సాగు చేస్తున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో సుమారు 15 వేల హెక్టార్లలో బొప్పాయి సాగును రైతులు చేస్తున్నారు. ఎకరాకు మల్చింగ్ షీట్ 5 రోల్సు పడతాయి. మొదట నేలను బాగా దున్నిన తర్వాత డ్రిప్ పైపులు పరుస్తారు. దానిపై మట్టి బొదెలు వేస్తారు.


మల్చింగ్ షీట్ పరుస్తారు. మల్చింగ్ షీట్‌కు మధ్య, మధ్యలో రంధ్రాలు ఉంటాయి. ఆ రంధ్రాల్లో మొక్కలు నాటుతారు. డ్రిప్ పైపుల ద్వారానే నీరు, ఎరువులు మొక్కలకు అందుతాయి. మల్చింగ్ షీట్ తో కలుపు నివారణ అవుతుంది. భూమిలో తేమ త్వరగా ఆవిరి కాకుండా చేస్తుంది. అదే కాకుండా పంటకు హానికరమైన సూక్ష్మజీవులను నశింపజేస్తుంది. మల్చింగ్ షీట్‌లో పలు రకాలుగా ఉంటాయి. ఇందులో మొదటి రకం ఒక్క రోలు రూ.4 వేలు, రెండో రకం రూ.3 వేలు, మూడో రకం రూ.1300 ఉంటుంది. పొలంలో మొదట డ్రిప్ పైపులు వేసి అనంతరం బోదెలు వేసిన తర్వాతే మొక్కలు నాటాల్సి ఉంటుంది. ఎకరాకు 5 రోల్సు పడతాయి.


రైల్వేకోడూరు మండలంలో మల్చింగ్‌షీట్‌తో సాగవుతున్న బొప్పాయి తోట

లాభాలు కురిపించడమే కాకుండా కలుపు నివారణ తో పాటు తేమ త్వరగా ఆవిరి కాకుండా చేయడం, సూక్ష్మజీవులను నశింపజేయడం వంటివి రైతులకు మేలు చేస్తున్నాయి.

మల్చింగ్ షీట్‌కు డిప్ ఇరిగేషన్ చాలా సౌలభ్యంగా ఉంటుంది. మొక్కలు ఏపుగా పెరగడమే కాకుండా దృఢంగా ఉంటాయి. కాయల దిగుబడి బాగా వస్తుంది. మొక్కలకు అవసరమైన నీటిని మాత్రమే తీసుకుంటుంది. నీటిని పారగట్టడం వల్ల తేమ ఎక్కువగా ఉంటుంది. దీంతో బొప్పాయి మొక్కలకు అనుకూలంగా ఉండదు. కొందరు రైతులు డ్రిప్ ఇరిగేషన్ వైపు మక్కువ చూపిస్తున్నారు. చాలామంది రైతులు డ్రిప్ ఇరిగేషన్ వైపు మొగ్గు చూపాలని ఉద్యాన అధికారులు చెబుతున్నారు. మల్చింగ్ షీట్‌తో బొప్పాయి సాగు చేయడంతో లాభాలు ఉన్నాయని గుర్తించి రైతులు అందరూ ఇలాంటి సాగు చేస్తున్నారు. ప్రభుత్వం సబ్సీడీపై మల్చింగ్ షీట్ ఇస్తే ఉపయోగకరంగా ఉంటుందని పలువురు రైతులు కోరుతున్నారు.


మల్చింగ్ షీట్‌తో లాభాలు



మల్చింగ్ షీట్‌తో రైతులకు లాభాలు వస్తాయి. డ్రిప్ సౌకర్యంతో చక్కగా మొక్కలు పెరుగుతాయి. దీనివల్ల కాయల దిగుబడి బాగా వస్తుంది. ఇదే మొదటిసారిగా మల్చింగ్ షీట్ వేశాము. ఎరువులు డ్రిప్ ద్వారానే నేరు గా మొక్కలకు అందే విధంగా చేస్తున్నాము. దీంతో మంచి నాణ్యత గల కాయలను వినియోగదారులకు అందించవచ్చు.

- సొల్లేటి నరసింహులు,
బొప్పాయి రైతు, ఓబనపల్లె

ఇతర రాష్ట్రాల్లో బొప్పాయికి డిమాండ్



ఇతర రాష్ట్రాల్లో బొప్పాయికి మంచి డిమాండ్ ఉంది. దీంతో ఎక్కువగా రైల్వేకోడూరు ప్రాంతంలలోని రైతులు బొప్పాయి పంటను పండిస్తున్నారు. బొప్పాయిలో ఎక్కువగా కలుపు వస్తుంది. దీంతో రైతులు ఎక్కువగా కూలీలకు డబ్బులు వెచ్చించాల్సి వస్తోంది. మల్చింగ్ షీట్‌తో అయితే అనేక లాభాలు ఉన్నాయి. అందువల్ల దీనితోనే సాగు చేపట్టాము.

- కట్టా శివయ్యనాయుడు,
బొప్పాయి రైతు, రైల్వేకోడూరు

మిఠాయికి బూజు!

తనిఖీ చేపట్టిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ● ల్యాబ్‌కు శాంపిల్స్


ల్యాబ్‌కు తరలించేందుకు సీజ్ చేసిన మిఠాయి ప్యాకెట్లు

ప్రొద్దుటూరు రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు శివారులోని కొత్తపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న ఓ షాపింగ్‌మాల్‌లో కొనుగోలు చేసిన మిఠాయి (లాల్‌మైసూర్‌పాక్) ప్యాకెట్ బూజు పట్టిందని కొనుగోలు దారుడు ఆరోపించారు. పాడైన తినుబండారాలను అమ్ముతున్న విషయాన్ని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లగా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ హరిత, రూరల్ పోలీసు స్టేషన్ ఎస్‌ఐ మహమ్మద్‌రఫి షాపింగ్‌మాల్‌లో తనిఖీ చేపట్టారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. కడప వాసి శ్రీకాంత్, నరేంద్ర, మరికొందరు ప్రొద్దుటూరుకు వచ్చి షాపింగ్‌మాల్‌లో వస్తువులను కొనుగోలు చేశారు. నిత్యావసర వస్తువులు, పిల్లల అవసరార్థం లాల్‌మైసూర్‌పాక్‌ను కొనుగోలు చేసినట్లు చెప్పారు. స్టోర్ లోపల ప్యాక్‌ను ఓపెన్ చేసేందుకు ప్రయత్నించగా సిబ్బంది అభ్యంతరం చెప్పారని, దీంతో నగదును చెల్లించి బయటకు వచ్చి ప్యాకెట్ ఓపెన్ చేస్తే మిఠాయికి బూజు పట్టి ఉందని ఆరోపించారు. దీనిపై సిబ్బందిని ప్రశ్నించగా మేనేజర్ రావాలి, ఆయన సమాధానం చెబుతారు అంటూ విషయాన్ని దాటవేసి బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని వివరించారు. కస్టమర్లకు కనీస మర్యాద ఇవ్వకుండా మాట్లాడారని వాపోయారు. విషయం తెలిసిన ప్రొద్దుటూరు ఇన్‌స్పెక్టర్ హరిత, రూరల్ ఎస్‌ఐ మహమ్మద్‌రఫీ మంగళవారం షాపింగ్‌మాల్‌లో తనిఖీ చేపట్టారు. ఎనిమిది మిఠాయి ప్యాకెట్లను సీజ్ చేసి టెస్టింగ్ నిమిత్తం ల్యాబ్ కు పంపించనున్నట్లు తెలిపారు.

వేడుకగా ఈశ్వరీదేవి గురుపూజోత్సవాలు

రూ.10లక్షలు విరాళం ఇచ్చిన టీడీపీ నేత కానాల మల్లికార్జునరెడ్డి


దాతను సన్మానిస్తున్న మఠం యాజమాన్యం

బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జగన్మాత ఈశ్వరీదేవి అమ్మవారి 235వ ఆరాధన గురుపూజా మహోత్సవాలు వేడుకగా నిర్వహిస్తున్నారు. మూడోరోజు అమ్మవారు సజీవ సమాధి నిష్ఠ వహించిన పవిత్ర దినం కావడంతో ఆలయ ప్రాంగణలో మఠాధిపతి వీరశివకుమార స్వాముల దంపతుల ఆధ్వర్యంలో కుంకుమ పూజ చేపట్టారు. కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని కుంకుమార్చనలో పాల్గొన్నారు.

మఠం అభివృద్ధికి రూ.10లక్షలు విరాళం

డి.అగ్రహారం టీడీపీ మండల నేత కానాల మల్లికార్జునరెడ్డి ఈశ్వరిదేవి అమ్మవారి మఠం అభివృద్ధికి తన వంతు రూ.10లక్షలు ఆర్థిక సాయం ప్రకటించారు. మంగళవారం ఆయన కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, వెల్లటూరు సాంబశివారెడ్డి, రేకలకుంట శివయాదవ్, చిలమల నాగయ్య, చెన్నుపల్లి జయరామిరెడ్డి, పూజా శివాయాదవ్, మస్తాన్‌యాదవ్, గంగరాజుయాదవ్, మేకల సుధాకర్ యాదవ్, మఠాధిపతి సంపత్ కుమార్ తదితర భక్తులు పాల్గొన్నారు.

కరుణామయ పిల్లల ఆశ్రమంలో మినీ క్రిస్మస్


పిల్లలకు దుప్పట్లు, బెడ్‌షీట్లు, స్కూల్ బ్యాగులు పంపిణీ చేస్తున్న ప్రముఖ జ్యోతిష్య నిపుణుడు సురేష్‌బాబు

కడప కల్చరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కడప నగర తోళ్లగంగనపల్లె వద్దగల మెర్సీ కరుణామయ ఆశ్రమంలో మంగళవారం మినీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ జ్యోతిష్య నిపుణుడు ఎం. సురేష్ బాబు హాజరై మాట్లాడారు. మనమం తా క్రీస్తు బాటలో నడవాలన్నారు. పరలోక రాజ్యం చిన్నపిల్లలదే అన్నారు. ప్రతి ఒక్కరూ తమకున్న దానిలో కాసింతైనా అనాథ చిన్న పిల్లలకు దానం ఇవ్వాలన్నారు. అప్పుడే దేవుని అనుగ్రహం లభిస్తుందన్నారు. అనంతరం క్రిస్మస్‌కేక్ కట్‌చేసి చిన్న పిల్లలకు పంపిణీ చేశారు. కొత్త బట్టలు, స్కూల్ బ్యాగులు, బెడ్‌షీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫాదర్స్ విజయరావు, చంద్ర, సుధాకర్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం పాలిటెక్నిక్ విద్యార్థుల విజయం


ప్రొద్దుటూరు డీఎస్పీ ద్వారా మెమెంటో అందుకుంటున్న విజేతలు

సింహాద్రిపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పాలిటెక్నిక్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్(ఐపీఎస్ జీఎం)-2024 ఉమ్మడి కడప జిల్లా స్థాయి క్రీడల పోటీల్లో సింహాద్రిపురం పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు విజయం సాధించిన ట్లు కళాశాల ప్రిన్సిపాల్ తాతాజీ తెలిపారు. ప్రొద్దుటూరులో నిర్వహించిన ఐపీఎస్‌జీఎం క్రీడల్లో మా కళాశాల విద్యార్థులు అనేక విభాగాల్లో ప్రతిభ కనపరచి ప్రథమ స్థానాల్లో నిలిచినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. మా విద్యార్థులు అత్యంత ప్రతిభ కనపరచి వాలీబాల్ జట్టు విజేతలుగా నిలిచారు. డిస్కస్‌త్రోలో కౌసిక్ కుమార్‌రెడ్డి ప్రథమ స్థానం, 100మీటర్ల రిలేలో వర్ధన్, భరత్, స్టాలిన్, మధుసూదన్ ద్వితీయ స్థానం, 200మీటర్ల పరుగు పందెంలో వర్ధన్ ద్వితీయ స్థానం, 100మీటర్ల పరుగులో వర్ధన్ తృతీయ స్థానం, షాట్‌పుట్, లాంగ్ జంప్‌లో కార్తీక్‌రెడ్డి తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలు ప్రొద్దుటూరు డీఎస్పీ భక్తవత్సలం ద్వారా బహుమతు లు అందుకున్నారని ప్రిన్సిపాల్ తెలిపారు. క్రీడా పోటీల విజేతలను, ప్రిన్సిపాల్ తాతాజీ, అధ్యాపకులు అభినందించారు. క్రీడల్లో విజేతలుగా నిలిచేందుకు కృషి చేసిన ఫిజికల్ డైరెక్టర్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రిన్సిపాల్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

కర్నూలు ఫారెస్టు సర్కిల్ ప్రతినిధిగా శ్రీపతి ఓబులేసు



కడప క్రైం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తిరుపతిలో జరిగిన ఏపీ జూనియర్ ఫారెస్టు ఆఫీసర్స్ అసోసియేషన్ స్టేట్ బాడీ ఎన్నికల్లో కడప అటవీ డివిజను నుంచి కర్నూలు సర్కిల్ ప్రతిని ధిగా శ్రీపతి ఓబులేసును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ కర్నూలు సర్కిల్‌లోని కడప, ప్రొద్దుటూరు, నంద్యాల, కర్నూలు అటవీ డివిజన్‌లోని ఫారెస్టు సిబ్బంది సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారా నికి కృషి చేస్తానన్నారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

కాలుజారి పడి మహిళ మృతి



సుండుపల్లె, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గుట్టపై ఉన్న ఆలయానికి వెళుతుండగా కాలు జారి కింద పడడంతో ఓ మహిళ మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. పెద్దినేని కాలువ పంచాయతీ బెస్తపల్లి వాసి బెస్తల నాగమునెమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. మం గళవారం తెల్లవారుజామున ఓబులేసుగుట్టపై ఉన్న ఓబులేశ్వరస్వామి (శివుడు)ని దర్శించుకునేందుకు బయలుదేరింది. మార్గమధ్యలో కా లు జారి కిందపడి అక్కడికక్కడే మరణించింది. ఈ మేరకు కుటుం బ సభ్యులు ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు సుండుపల్లె ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు.

శ్రీవారి కల్యాణం

చురుగ్గా ఏర్పాట్లు
నేడు కుంకుమార్చన, నిశ్చితార్థం
రేపు కల్యాణం, గ్రామోత్సవం


అన్నమయ్య విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్న గోవిందమాల భక్తులు

కడప ఎన్టీఆర్ సర్కిల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవ నిర్వహణకు కడప మున్సిపల్ స్టేడియంలో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. నగరంలోని గోవిందమాల భక్త బృందం సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీవారి భక్తుల సహకారంతో 14ఏళ్లగా వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 15వ వార్షికోత్సవం పురస్కరించుకుని 25,26వ తేదీల్లో కల్యాణోత్సవం నిర్వహిస్తున్నారు. నియమ, నిష్ఠలతో దీక్ష పరులైన గోవిందమాల భక్తులు శ్రీవారి ఐక్యతగా పూజలు నిర్వహిస్తూ కల్యాణంలో పాల్గొనాలని భక్తులకు ఆహ్వానం పలుకుతున్నారు. స్వామివారి కల్యాణం విజయవంతం చేసేందుకు ప్రతి కుటుంబం బాధ్యత చేపట్టాలని నిర్వహకులు కోరారు. మంగళవారం నగరంలోని అన్నమాచార్యుల విగ్రహానికి పూజలు నిర్వహించారు.

నేడు నిశ్చితార్థం

రెండు రోజులు వైభవంగా నిర్వహించనున్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ క్రతువులో భాగంగా బుధవారం ఉదయం ఐదు గంటలకు సుప్రభాత సేవతో కార్యక్రమాలు మొదలవుతాయి. 5.30గంటలకు కొలువు అర్చన ప్రారంభమవుతుంది. 7.30కు గోపూజ, 8కి మూల వర్లకు అభిషేకం, వస్త్రాలంకరణ 9.30 గంటలకు నిశ్చితార్థం, 12 గంటలకు తిరుప్పావై, సాయంత్రం 5గంటలకు సువాసినిల చేత సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తారు. ఆసక్తి ఉన్న మహిళలు ఎవరైనా పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తారు. 6.30గంటలకు ఎదురు కోలోత్సవం నిర్వహిస్తారు.

కల్యాణోత్సవం విజయవంతం చేయండి



శ్రీ వారి కల్యాణాన్ని విజయవంతం చేయాలి. కడప నగరంలోని మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్న శ్రీవారి కల్యాణంలో ప్రతి ఒక్కరూ పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కాగలరు. గ్రామోత్సవంలో దీప హారతి పట్టేందుకు మహిళలకు అవకాశం ఉంది. ప్రతి ఒక్కరూ కల్యాణోత్సవంలో పాల్గొనడం శుభకరం.

పుల్లారెడ్డి, చైర్మన్ గోవింద మాల భక్త బృందం సేవా సమితి, కడప


శ్రీవారి కల్యాణానికి ముస్తాబవుతున్న వేదిక

రేపు కల్యాణం, గరుడ సేవ

26వ తేదీ గురువారం ఉదయం 9గంటలకు పచ్చటి తోరణాలు, మంగళవాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చారణ, అన్నమయ్య సంకీర్తన మధ్య శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. కల్యాణోత్సవానికి వచ్చిన భక్తులకు గోవింద మాల భక్త బృంద సేవా సమితి ఆధ్వర్యంలో ప్రసాద వితరణ జరుగుతుంది. సాయంత్రం గ్రామోత్సవంలో భాగంగా శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారికి గరుడ సేవ నిర్వహించనున్నారు. కోలాటాలు, చెక్కభజనలు, పంచ వాయిద్యాలు, బ్యాండు మేళాలు, బాణసంచా వెలుగుల మధ్య మున్సిపల్ స్టేడియం నుంచి ప్రారంభమయ్యే గ్రామోత్సవం శంకరాపురం, చిన్నచౌకు, వై జంక్షన్, ఎన్జీఓ కాలనీ, అప్సర సర్కిల్ మీదుగా అన్నమయ్య సర్కిల్ వరకు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

బాధలు భరించలేకే హత్య

కుమారుడి హత్య కేసులో తండ్రి సహా ముగ్గురి అరెస్ట్ ● వివరాలు వెల్లడించిన సీఐ


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసులు

పుంగనూరు, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): కుమారుడి వేధింపులు భరించలేక కన్నతండ్రే బిడ్డను సుపారీ ఇచ్చి హతమార్చిన కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. సీఐ కథనం మేరకు... అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం కోళ్లబైలు పంచాయతీ దిగువమామిడిగుంపుల పల్లె వాసి గంగులరెడ్డి కుమారుడు సోమశేఖరరెడ్డి(36) చిన్నతనం నుంచి చెడు అలవాట్లకు బానిసై తరచూ గొడవలు పడేవాడు. పదేళ్ల కిందట వివాహం చేయగా సోమశేఖర్‌రెడ్డి పెట్టిన చిత్రహింసలు భరించలేక భార్య, ఐదేళ్ల కుమారుడు బావిలో దూకి చనిపోయారు. దీనిపై మదనపల్లె తాలూకా పోలీసులు సోమశేఖరరెడ్డి, అతడి తండ్రి గంగులరెడ్డిపై కేసు నమోదు చేసి జైలుకు పంపారు. జైలు నుంచి వచ్చాక కూడా సోమశేఖరరెడ్డి మద్యానికి బానిసగా మారి గ్రామంలో అందరితో ఘర్షణ పడేవాడు. తనకు రెండో పెళ్లి చేయాలని తల్లిదండ్రులను తరచూ దుర్భాషలాడుతూ కొట్టేవాడు. ఈ బాధలు భరించలేక గంగులరెడ్డి తన కుమారుడు సోమశేఖరరెడ్డిని చంపేస్తే పీడ విరగడవుతుందని నిర్ణయించుకున్నాడు. పుంగనూరు మండలం చంద్రమాకులపల్లె పంచాయతీ గానుగులగడ్డకు చెందిన ఆటో డ్రైవర్ ఎం. అమరనాథ్, ఎం.రమేష్, ఫణేంద్రనాయక్‌తో మాట్లాడి రూ.35వేలకు బేరం కుదుర్చుకున్నాడు. ఇందులో భాగంగా అమరనాథ్ ఆటోలో సోమశేఖరరెడ్డిని బోయకొండ అటవీప్రాంతానికి తీసుకెళ్లి రాళ్లతో కొట్టి హత్య చేసి గుంతలో పడవేసి మృతదేహం కనిపించకుండా బోదగడ్డితో కప్పారు. ఈ నెల 20 తేదీ అటవీ ప్రాంతంలో ఓ మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఎముకల గూడుగా కన్పించినట్లు పోలీసులకు చంద్రమాకులపల్లె వీఆర్వో శ్రీనివాసులు ఫిర్యాదు చేశారు. పుంగనూరు పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి సోమశేఖరరెడ్డి శవంగా గుర్తించారు. దీనిపై దర్యాప్తు చేసి సోమవారం రాత్రి హతుడి తండ్రి గంగులరెడ్డి, ఆటో డ్రైవర్ అమరనాథ్, ఎం, రమేశ్‌ను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

పాముకాటుతో మహిళ మృతి


గంగమ్మ మృతదేహం

వల్లూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పెద్దలేబాక గ్రామంలో పాముకాటుతో మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... పెద్దలేబాక వాసి పెండ్లిమర్రి గంగమ్మ(60) సోమవారం ఇంట్లో నేలపై నిద్రిస్తుండగా తెల్లవారుజామున పాము కాటు వేసింది. ఆమె బంధువులు పామును గుర్తించి చంపేశారు. వెంటనే కమలాపురంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ఆమెకు ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతదేహాన్ని మంగళవారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

సీఐ డ్రైవర్‌పై లైంగిక వేధింపుల కేసు నమోదు

కొండాపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కొండాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో డ్రైవర్‌గా పనిచేస్తున్న రాయుడుపై లైంగిక వేధింపుల కేసు నమోదైంది. చౌటిపల్లె మహిళ తనను సీఐ డ్రైవర్ కొంతకాలంగా ఫోన్‌లో లైంగికంగా వేధిస్తున్నాడని ఎస్పీకి ఫిర్యాదు చేసింది. అంతేకాకుండా గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ భర్త ఓంకార్ కూడా తనను వేధిస్తున్నాడని బాధిత మహిళ ఆరోపించింది. ఈ విషయం ప్రస్తుతం విచారణ జరుగుతున్నట్లు పోలీసులు చెప్పారు. ఈమెపై గతంలో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈమెపై కేసు ప్రస్తుతం విచారణలో ఉందన్నారు. కాగా డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, విచారిస్తున్నట్లు ఎస్‌ఐ విద్యాసాగర్ తెలిపారు.

పీఈటీ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

మైలవరం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గురుకుల ఉన్నత పాఠశాలల పీఈటీ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వెంకటసావిత్రి తెలిపారు. బీపీఈడీ అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

17 ఏళ్లుగా పరిహారం కోసం ఎదురుచూస్తున్నాం...

● జేసీ ఎదుట ముంపువాసుల ఆవేదన


చింతువాండ్లపల్లెలో జేసీ ఎదుట ముంపుబాధితుల ఆవేదన

అట్లూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): 17 సంవత్సరాలుగా ముంపు పరిహారం కోసం ఎదురు చూస్తున్నామని జాయింటు కలెక్టరు అదితిసింగ్ ఎదుట ముంపువాసులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. సోమశిల రిజర్వాయరులో ప్రభుత్వం 78 టీఎంసీలు నిల్వ ఉంచాలని అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో ముంపు గ్రామాలైన చింతువాండ్లపల్లె, ఆకుతోటపల్లె గ్రామాలను జేసీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ఎదుట ముంపు వాసులు తమ గోడు వెల్లబోసుకున్నారు. 2007 సంవత్సరంలో మా గ్రామాలను ముంపు గ్రామా లుగా అధికారులు ప్రకటించారని, 78 టీఎంసీలు నిల్వ ఉంచితే మా గ్రామాల్లోకి మూడు అడుగులు సోమశిల వెనుక జలాలు చేరుతాయన్నారు. దీంతో ఊర్లలో పాములు, రకరకాల విషసర్పాలు రావడంతో దాదాపు ముగ్గురు నలుగురు కూడా గతంలో చనిపోయారన్నారు. చింతవాండ్లపల్లెకు 158 ఇళ్లకు, ఆకుతోటపల్లె 400 గృహా లకు పరిహారం చెల్లించాలని ఆమె ముంగిట వెల్లడించారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఎన్నో మార్లు ముంపుజలాలు గ్రామాల్లో చేరినా అధికారులు పరిశీ లించి వెళ్లారు తప్ప న్యాయం చేయలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకుని మాకు పరిహారం అందేలా చూడాలన్నారు. ఇందుకు జేసి స్పందించి పైఅధికారులకు నివేదికలు అందజేస్తామని తెలిపారు. సోమశిల ప్రాజెక్టు ఎస్ఈ వెంకటరావిఎరెడ్డి, ఈఈ రమణారెడ్డి, స్పెషల్ కలెక్టరు శ్రీనివాసులు, బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్, అట్లూరు తహసీల్దారు సుబ్బలక్షుమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్రిక్తతల నడుమ సమావేశం

ఇద్దరు టీడీపీ నేతలకు గాయాలు ● వైసీపీ నేతపై కేసునమోదు ● పోలీసుల వైఫల్యమే కారణం : టీడీపీ శ్రేణులు


బారికేడ్లను తోసుకువెళ్తున్న వైసీపీ నేతల వాహనాలు

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 24 (ఆంధ్ర జ్యోతి): పీటీఎంలో మంగళవారం మండల సమావేశం ఉద్రిక్తతల నడుమ కొన సాగింది. కోర్టు ఆదేశాలతో సమావేశం చేసుకోవాలని ఆదేశించడంతో మంగళవారం ఉదయం వైసీపీ నేతలు పక్కా పథకం ప్రకారం తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి జనాన్ని పీటీఎంకు పిలిపించుకుని మండల సమావేశం జరిగే సమావేశ ప్రదేశానికి ఒక్క సారిగా దూసుకొచ్చారు. వైసీ పీ శ్రేణులను నిలువరించే క్రమంలో ఇద్దరు టీడీపీ నేతలకు గాయాలయ్యాయి. ఉదయం నుంచే పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేసి సమావేశానికి హాజరయ్యే ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా పరిశీలించారు. వైసీపీ నేతలు కోర్టు అనుమతులతో మండల సమావేశాన్ని నిర్వహిస్తున్నామని అత్యుత్సాహం ప్రదర్శించారు. వైసీపీ నేతల పథకం ప్రకారం ఉదయం నుంచే సమావేశ మం దిరానికి కూతవేటు దూరంలో ఓ ప్రైవేటు భవనంలో మాటు వేసి సమావేశం నిర్వహించే సమయానికి బారికేడ్లను తోసుకుంటూ వారి వాహనాల్లో లోపలికి చొచ్చుకు పోయారు. టీడీపీ నేతలు వారిని నిలువరించాలని ప్రయత్నం చేయగా పోలీసులు, వైసీపీ నేతలు, టీడీపీ నేతల నడుమ తోపులాట జరిగింది. దీంతో ఇద్దరు టీడీపీ నేతలకు గాయాలయ్యాయి. వైసీపీ నేతలు ఎట్టకేలకు మండల సమావేశానికి చేరుకుని వైసీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో కలిసి సమావేశాన్ని నామమాత్రంగా నిర్వహించి చేతులు దులిపేసుకున్నారు. ఎంపీపీ మహమూద్ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించినట్లు అధికారులు కొద్ది మంది మాత్రమే హాజరవడంతో హాజరైన సభ్యులతో సంతకాలు చేయించి మమ అనిపించారు. అనంతరం వైసీపీ శ్రేణుల వాహనాల తాకిడితో గాయపడిన టీడీపీ నేతలు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. వైసీపీ నేతలు పథకం ప్రకారం ప్రజా ప్రతినిధులు కాని వారు పీటీఎంలో అల్లర్లు సృష్టించారని తమపై కావాలనే వాహనాలతో దాడి చేశారని ఆరోపించారు. వైసీపీ నేతల అరాచకాలు ఇంకెన్నాళ్లని ప్రశ్నించారు. తాము అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నట్లుగా వైసీపీ నేతలు దాడి చేస్తున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారన్నారు. పోలీసుల వైఫల్యంతోనే ఇదంతా జరిగిందంటూ టీడీపీ నేతలు ఆరోపించారు. టీడీపీ నేత రాపూరివాండ్లపల్లె గ్రామం కొత్తప ల్లెకు చెందిన పప్పు రాజారెడ్డి ఫిర్యాదుపై వైసీపీకి చెందిన తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి పీఏగా పని చేసిన ప్రవీణ్ కుమార్‌రెడ్డి అలియాస్ పాపిరెడ్డి ఇతను అంగళ్లు అల్లర్ల కేసులో టీడీపీ నేతలకు ప్యాంట్ జిప్పు ఇప్పి చూపించిన వ్యక్తి ఇతను తమ అనుచరులతో వచ్చి అల్లర్లు సృష్టించి టీడీపీ నేతలను పథకం ప్రకారమే తన అనుచరులతో బారికేడ్లను వాహనాలతో తోసుకుంటూ వెళ్లారన్నారు. సమావేశాన్ని ముగించిన అనంతరం వైసీపీ శ్రేణులు బయటి వ్యక్తులు అంతా రావడంతో భారీగా నినాదాలతో వెళుతున్నా పోలీసులు వారిని నిలవరించకుం డా మిన్నకుండి పోయారని టీడీపీ నేతలు ఆరోపించారు. గాయ పడిన ఇద్దరిలో పీటీఎంకు చెందిన పాలగిరి రామాంజులు, మరొకరు రాపూరివాండ్లపల్లె పంచాయతీ కొత్తపల్లెకు చెందిన పప్పు రాజారెడ్డి గాయపడిన వారిని తంబళ్లపల్లె నియోజకవర్గం టీడీపీ నేత దాసిరిపల్లె జయచంద్రారెడ్డి పీటీఎంకు చేరుకుని వారిని పరామర్శించి ప్రమాదానికి కారణమైన వైసీపీ నేతలపై కేసు నమోదు చేయాలని పోలీసులను కోరారు.

ఊట నేలలో ఇళ్ల నిర్మాణాలు.. సాగేదెలా?

- పునాదుల్లో నిరంతరాయంగా ఊరుతున్న నీరు
- నిర్మాణ సామగ్రి మోసుకెళ్లేందుకూ దారి లేదు
- పట్టాలు రద్దు చేస్తామంటున్న అధికారులు

పెనగలూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పునాదుల్లోంచి ఊరుతున్న నీరు ఓ వైపు.. ఇళ్లు నిర్మించుకోకపోతే పట్టాలు రద్దు చేస్తామన్న అధికారుల హెచ్చరికలు ఓ వైపు.. పెనగలూరు జగనన్న కాలనీ లబ్ధిదారులను అయోమయానికి గురి చేస్తున్నాయి.

పెనగలూరు మండల కేంద్రంలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం ఈ నెల ఆఖరు వరకు అవకాశం ఇచ్చింది. ఆ మేరకు అధికారులు లబ్ధిదారులకు పదేపదే వివరిస్తున్నారు. అయితే, జగనన్న కాలనీకి కేటాయించిన స్థలం ప్రత్యేకత కారణంగా ఆ ప్రాంతంలో ఎప్పుడంటే అప్పుడు ఇళ్లు నిర్మించుకునే అవకాశం లేకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ లేఔట్ రంగం చెరువుకు సమీపంలో ఉండగా, చెరువు పెనగలూరు నాగిరెడ్డిపల్లె, కొత్తపల్లె, పెనగలూరు టౌన్ల మధ్యలో ఉంటుంది దీంతో ఓ మోస్తరు వర్షం కురిసినా నాలుగు గ్రామాల నుంచి వచ్చే నీరు చెరువులో చేరుతుంది. అందువల్ల ఏడాది పొడవునా రంగం చెరువులో నీరు నిల్వ ఉంటుంది. దీనికి సమీపంలోని పదెకరాల శ్మశాన స్థలంలో రెండెకరాల వరకు జగనన్న కాలనీకి ఎంపిక చేసి, అందులో ఒక్కో లబ్ధిదారునికి ఒకటిన్నర సెంటు లెక్కన స్థలం ఇచ్చి అక్కడ గృహం మంజూరు చేశారు. కాగా, చెరువులో నీరున్న సమయంలో ఆ ప్రాంతంలో అడుగు లోతు తవ్వితే చాలు నీరు ఊరుతుంది. కొన్ని సార్లు తవ్వకపోయినా నీరు బయటి ఉబికి వస్తుంటుంది. ఈ ఊట నీరు ఎండాకాలం వచ్చే వరకు ఉంటుంది. దీంతో ఇంకో నాలుగు నెలలు ఇక్కడ పునాదులు వేయడం సాధ్యం కాదు. పునాదులు వేసిన గృహాల పనులు చేయడం కూడా సాధ్యం కాదు. గోడల కార్యక్రమం తలపెట్టాలన్నా ఊరుతున్న ఊటనీటి వల్ల ఈ కార్యక్రమాన్ని కూడా తలపెట్టలేరు. ఇక్కడ ఏ కార్యక్రమం చేయాలన్నా ఇప్పటి నుంచి నాలుగు నెలలు ఆగాల్సిందే. ఇప్పటిదాకా పునాదుల స్థాయిలోనో, గోడల వరకో పూర్తయిన నిర్మాణాలన్నీ వేసవిలో చేసినవే. ఈ ప్రాంతంలో స్థలాలు కేటాయించే ముందు అధికారులు వారం రోజులపాటు మట్టి తోలి స్థలం ఎత్తు పెంచారు. అయినా ఊటనీటి బాధ తప్పలేదు. దీంతో ఒక్కో లబ్ధిదారు భూమట్టానికి 5 నుంచి 6 అడుగుల ఎత్తు పునాది వేసుకుని ఇంటి నిర్మాణం ప్రారంభించారు. దీంతో ప్రభుత్వం మంజూరు చేసిన ఒకట్నిర లక్షల రూపాయల్లో లక్ష రూపాయలు పునాదికే సరిపోయింది. దీంతో అధిక శాతం నిర్మాణాలు అసంపూర్తిగా మిగిలాయి. మొత్తానికి 10 లోపు గృహాలు నిర్మాణం పూర్తి కాగా, 30 గృహాలు గోడల స్థాయిలో, 20 పునాదుల స్థాయిలో ఉన్నాయి. అసంపూర్తి గృహాలను ఈ నెలాఖరు లోపు పూర్తి చేయాలని అధికారులు పదే పదే చెబుతున్నా ఊటనీటి కాలనీల్లో నిర్మాణం ఎలా అని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో తమ గృహాలు రద్దై పోతాయేమోనని ఇప్పటికే రూ. లక్ష నుంచి 4 లక్షల రూపాయల వరకు ఖర్చు పెట్టిన లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా నిర్మాణానికి నోచుకోని పక్కాగృహాలను ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో ప్రభుత్వం రద్దు చేసింది. సగం నిర్మాణాలు పూర్తి చేసిన తమ గృహాలు కూడా ఎక్కడ రద్దు అయిపోతాయోనని ఆందోళనకు గురవుతున్నారు. ఈ లేఔట్ అధికారులు పరిశీలించి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని లబ్ధి దారులు కోరుతున్నారు.


జగనన్న కాలనీలో అర్థాంతరంగా ఆగిన నిర్మాణాలు


నిర్మాణాల వద్ద గుంతల్లో ఊటనీరు

దారి సరిగా లేక ..



ఊట నీటి కారణంగా కనీసం ట్రైరు బండి కూడా వెళ్లేందుకు వీలులేకుండా పోయింది. కూలీలు. ఇటుకలు నెత్తిన పెట్టుకొని మోసుకెళ్లేందుకు కూడా దారి సరిగాలేదు. కనీసం మరో నెల రోజులు ఇదే పరిస్థితి ఉంటుంది. దీంతో పనులు పూర్తి చేయలేకపోతున్నాం.

- కత్తి అమరావతి, అరుంధతివాడ, పెనగలూరు

నిర్మాణాలు పూర్తి చేయాల్సిందే..

నిబంధనల ప్రకారం ఈ నెలాఖరు లోపు గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి. స్లాబు పూర్తికాకుండా, గోడల స్థాయిలో నిర్మాణాలు పూర్తయిన గృహాలను కూడా రద్దు చేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఈ విషయాలపై లబ్ధిదారు లందరికీ తెలియజేశాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు తప్పనిసరిగా చర్యలు తీసుకుంటాం.

- హరిప్రసాద్, ఏఈ, హౌసింగ్ కార్పొరేషన్

ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం చిన్నమండెం మండలం బోరెడ్డిగారి పల్లెలోని తమ నివాసంలో మంత్రి ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేద వాడి సమస్య పరిష్కారమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ముండ్లవాండ్లకోటపల్లిలో, కేశాపురం దేవళంపేటలో తాగునీటి సమస్య పరి ష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. మంగళవారం కేశాపురం గ్రామంలో బోరును ప్రారంభించారు. అనంతరం మాట్లాడు తూ ప్రాధాన్యత క్రమంలో ప్రతి గ్రామంలో బోర్లు వేసి మోటార్లు బి గించి గ్రామాలకు నీరు సరఫరా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

సంబేపల్లె: సంబేపల్లె మండలం శెట్టిపల్లికి చెందిన మహేశ్‌కు 5 లక్షల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌వోసీ పత్రాన్ని రాయచోటిలోని క్యాంపు కార్యాలయంలో అందజేశారు.

పీఎస్‌టీయూ డైరీ విడుదల

రాయచోటిటౌన్: ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (పీడీఎస్‌యూ) డైరీని మంత్రి ఆవిష్కరించారు. పీఎస్‌టీయూ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పీసీ రెడ్డెన్న, రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి, కార్యదర్శి ఎస్. మునిరెడ్డి, మైనార్టీ కన్వీనర్ మజహరుల్‌హక్, అన్నమయ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చెన్నుపల్లి ఓబుల్‌రెడ్డి, ఎస్‌యండీ జక్రియాబాషా, మైనార్టీ కన్వీనర్ లియాకత్‌అలీఖాన్, రాయచోటి మండల శాఖ అధ్యక్షులు హబీబుర్ రెహమాన్, టీడీపీ మైనార్టీ యువనాయకుడు అతావుల్లా, ఎద్దుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.


ప్రజా దర్బార్‌కు హజరైన ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి

వర్చువల్ విచారణ, డిజిటల్ సౌకర్యాలను వినియోగించుకోవాలి

- జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రఘురాం

రాయచోటిటౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులు వర్చువల్ విచారణ, డిజిటల్ సౌలభ్యాలను వినియోగించుకోవాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రఘురాం తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో జాతీయ వినియోగదారుల దినోత్సవం-2024ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల హక్కులకు సంబంధించిన కేసుల్లో కోవిడ్-19 తర్వాత వర్చువల్ విచారణ పద్ధతి అనగా ఆడియో, వీడియో ద్వారా నిర్వహించే విచారణకు ప్రాధాన్యం పెరిగిందన్నారు. 2020 నవంబరు 6 నుంచి అన్ని న్యాయస్థానాలు వర్చువల్ మోడ్‌కు మారడానికి సుప్రీంకోర్టు అనుమతించిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి రఘురాం

పేదలకో న్యాయం.. పెద్దలకో న్యాయమా..?

- న్యాయం చేయాలంటూ రోడ్డెక్కిన బాధితులు

గాలివీడు, డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి): ఆర్‌అండ్‌బీ స్థలంలోని నిరుపేదల రేకుల షెడ్లు తొలగించిన అధికారులకు అక్కడే ఉన్న భవంతులు కనిపించడం లేదా అని బాధితులు ప్రశ్నిస్తున్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గేటు నాలుగు రోడ్ల కూడలిలో నివాసాలు కోల్పోయినవారు తమకు న్యాయం చేయాలంటూ రోడ్డెక్కారు. ఆర్‌అండ్‌బీకి చెందిన సర్వే నెంబరు 2266లో అక్రమంగా నివాసం ఉన్నారంటూ రెవెన్యూ అధికారులు తమ నివాసాలను నిర్దాక్షిణ్యంగా నేలమట్టం చేశారని, అదే జాగాలో ఉన్న ధనవంతుల భవంతుల జోలికి మాత్రం వెళ్లడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలగిస్తే ఆక్రమణలో ఉన్న అన్ని నిర్మాణాలు తొలగించాలని, లేకుంటే తాము మళ్లీ నివాసాలు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతులు ఇవ్వాలని బాధితుడు డిమాండ్ చేశారు. ధనవంతులు ఇచ్చే మామూళ్లకు అమ్ముడుపోయి అధికారులు నిరుపేదల కడుపు కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై సమగ్ర విచారణ చేసి తగిన న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు.



గాలివీడులో నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు

జీవితాన్ని ప్రతిబింబించే కావ్యం రామాయణం

రాజంపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సమాజంలోని ప్రతి మానవుని జీవితానికి సంబంధించిన విషయాలను ప్రతిబింబించే మహాకావ్యం రామాయణం అని టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ తెలిపారు. పట్టణంలోని ఎర్రబల్లె రామాలయంలో మంగళవారం జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ గోపిబాబు పర్యవేక్షణలో, ధార్మిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాలయంలోని ప్రతిపాత్ర సమాజంలోని వ్యక్తులకు ప్రతీకలుగా నిలుస్తాయన్నారు. రాఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఉల్లంగి నాగరాజు, కమిటీ సభ్యులు పంతుల లోకేష్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

హోం మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలి

రాయచోటిటౌన్, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అవమానకర వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా తక్షణం రాజీనామా చేయాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆ పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు అబ్బవరం యుగంధర్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. జిల్లా నేతలు ఆంజనేయులు, బాలాజీ, శ్రీనాథ్, గంగాధర్, మహేశ్, మల్లికార్జున, పట్టణ అధ్యక్షుడు గూటం మహేశ్, న్యాయవాది మంద నాగేశ్వరరావు, బహుజన వాదులు రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రపంచ రచయితల మహాసభలకు సుమనశ్రీకి ఆహ్వానం

నందలూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో ఈనెల 28, 29 తేదీల్లో జరిగే ఆరో ప్రపంచ రచయితల మహాసభల్లో 28వ తేదీ సాయంత్రం జరిగే సాంస్కృతిక రంగ ప్రతినిధుల సదస్సులో పాల్గొనేందుకు నందలూరుకు చెందిన రచయిత్రి డాక్టర్ కోడూరు సుమనశ్రీకి ఆహ్వానం అందింది. ప్రపంచ తెలుగు రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తి కొండ సుబ్బారావు, కార్యదర్శి జీవీ పూర్ణచందు తనకు ఆహ్వానం అందించినట్లు సుమనశ్రీ తెలిపారు

జిల్లా ప్రజలకు కలెక్టర్ క్రిస్మస్ శుభాకాంక్షలు

రాయచోటి(కలెక్టరేట్), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25న క్రిస్మస్ పండుగ సందర్భంగా అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్, జిల్లా ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఏసుక్రీస్తు బోధించిన ప్రేమ, కరుణ, శాంతిలకు చిహ్నంగా క్రిస్మస్ పండుగ జరుపుకుంటారని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు

రాజంపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రీజెన్సీ నలందా విద్యాలయంలో మంగళవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు.

సీఈవో గుడారు విజయ చందు, ప్రిన్సిపాల్ సుబ్బరాయుడు, హెడ్మా స్టర్ పీవీ సుబ్బయ్య చిన్నారులతో కేక్ కట్ చేయించి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా సీఈవో గుడారు విజయ్‌చందు మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ శాంతికి చిహ్నమని తెలిపారు.



అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే బాదుడు షురూ..

- గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటిటౌన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పాటు విద్యుత్ చార్జీలు పెంచమని పదే పదే చెప్పిన చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే విద్యుత్ చార్జీలు పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్నాడని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు మోసపూరిత మాటలు నమ్మి ఓట్లేసిన ప్రజలకు కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల రూపంలో షాక్ ఇస్తోందన్నారు. డిసెంబరు నెల కరెంటు బిల్లులు ప్రజల నడ్డి విరిచేలా ఉన్నాయన్నారు. దీనికి తోడు ఇంధన సర్దుబాటు చార్జీలు (ఎఫ్‌పీపీసీఏ) పేరుతో ప్రతి యూనిట్‌కు 61 పైసలు చొప్పున అదనపు భారాన్ని మోపుతున్నారన్నారు. దాదాపు ప్రతి సర్వీసుకు రూ.30 నుండి రూ500 వరకు అదనంగా భారం పడుతోందన్నారు. వినియోగదారులే విద్యుత్తును అమ్మేలా చేస్తానని చంద్రబాబు ప్రగల్భాలు పలికిన విషయాన్ని గుర్తు చేశారు. అబద్ధపు వాగ్దానాలు చేసి ప్రజలతో ఓట్లేయించుకుని ప్రజలను బాదేస్తున్నారన్నారు. ప్రజలకు పథకాలు ఏమీ ఇవ్వకపోగా ప్రజల నుంచే వసూళ్లకు పాల్పడుతున్నట్లు విమర్శలు చేశారు. ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో బలవంతంగా విద్యుత్ చార్జీల వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. కేంద్ర మంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో అంబేడ్కర్‌ను విమర్శించినా టీడీపీ నేతలు ఎందుకు నోరుమెదపడం లేదో చెప్పాలని ప్రశ్నించారు. విద్యుత్ చార్జీల పెంపును ప్రభుత్వం విరమించాలన్న డిమాండ్‌తో ఈ నెల 27న రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన పోరుబాటను విజయవంతం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రెవెన్యూ సదస్సులో సమస్యల పరిష్కారం

రామాపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) :: భూ సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని ఆర్డీవో శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కల్పనాయునిచెరువు సచివాలయంలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. భూ సమస్యలు ఉన్న వారు ఫిర్యాదు చేస్తే వెంటనే వీఆర్‌వో ద్వారా వాటిని పరిష్కరిస్తామన్నారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామాంజనేయులు, నోడల్ ఆఫీసర్ మణి, ఆర్‌ఐ సమ్మత్‌ఖాన్, వీఆర్‌వో గంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట: రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగి తిరిగి వేసారినా పరిష్కారానికి నోచుకోని సమస్యలకు రెవెన్యూ సద స్సుల్లో వెంటనే పరిష్కారం లభిస్తుందని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. మంగళవారం రాజంపేట మండలం పెద కారంపల్లెలో రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. అనసూయా దేవి, రేవూరి వేణుగోపాల్, గన్నే సుబ్బనరసయ్యనాయుడు, సతీష్‌రాజు, మాజీ సర్పంచ్ దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

వేలాడుతున్న విద్యుత్ లైన్లు సరిచేయండి

రైల్వేకోడూరు, డిసెంబరు 24: (ఆంధ్రజ్యోతి): పొలాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగల కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని రైల్వే కోడూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి గోశాల దేవి తెలిపారు. మంగళవారం అనంతరాజుపేట పంచాయతీ తూర్పుపల్లెలోని పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెంగమ్మ అనే రైతుకు చెందిన పొలంలో విద్యుత్ తీగలు వేలాడుతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ విషయం విద్యుత్ అధికారులకు చెప్పినా ప్రయోజనం లేదన్నారు. ఇప్పటికైనా విద్యుత్ తీగలను సరి చేయకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఎస్. శాంతయ్య, విద్యార్థి నాయకుడు నన్నం గణేష్, ఎస్సీ నాయకులు నాగరాజు, బీసీ నాయకులు శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.


వేలాడుతున్న విద్యుత్ తీగలను చూపుతున్న గోశాల దేవి

బోయనపల్లెలో బీజేపీ బూత్‌కమిటీ ఎన్నిక

రాజంపేట టౌను, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మండలం బోయనపల్లె గ్రామంలో మంగళవారం 124, 125 పోలింగ్ బూత్ కమిటీల బీజేపీ అధ్యక్షులుగా బీమిశెట్టి పురుషోత్తమరావు, పి.పవన్‌కుమార్ యాదవ్‌లను ఎన్నుకున్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్ నాయుడు ఆధ్వర్యంలో ఈ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు సార్వత్రిక ఎన్నికల నాటికి రాష్ట్రంలో బీజేపీని బలోపేతం చేయడంలో భాగంగా బూత్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాపయ్య, హరిప్రసాద్, వెంకటయ్య పాల్గొన్నారు.

సంపద కేంద్రం నిర్వహణపై డీపీవో ఆగ్రహం

వీరబల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్వహణ సక్రమంగా లేక పోవడంతో జిల్లా పంచాయతీ అధికారి బాలకృష్ణారెడ్డి ఆగ్ర హం వ్యక్తం చేశారు. మంగళ వారం ఆయన మట్లిలోని చెత్త సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. మోడల్‌గా తీసుకున్న ఈ కేంద్రంలో పిచ్చిమొక్కలు మొల వడం, అపరిశుభ్రంగా ఉండడం గమనించారు. మోడల్‌గా తీసుకుని ప్రత్యేక నిధులను కేటాయించినా నిర్వహించేది ఇలాగేనా అని ఈవో ఆర్‌డీ రామ చంద్రారెడ్డి, గ్రామ కార్యదర్శి రామచంద్రుడును ప్రశ్నించారు.

బత్తినవారిపల్లెకు సీసీ రోడ్డు ఏర్పాటు

వీర బల్లి, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): మండలంలోని మట్లి గ్రామం బత్తినవారిపల్లెలో ఎట్టకేలకు గ్రామ సర్పంచ్ సోమారపు నాగార్జునాచారి సిమెంటు రోడ్డు ఏర్పాటు చేయించారు. ఈ రోడ్డు ఏర్పాటు విషయంలో గ్రామంలో నెల రోజులుగా వివాదంఏర్పడడంతో విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లింది. వారు ఆదేశించినా కొందరు రోడ్డు ఏర్పాటుకు సహకరించలేదు. ఈ నేపథ్యంలో సర్పంచ్, గ్రామ పెద్దలు చొరవ చూపి పనులు పూర్తి చేశారు.

ఆర్థిక సాయం

రాజంపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పోరుమామిళ్ల మండలానికి చెందిన జనసేన పార్టీ కార్యకర్త రాళ్లపల్లె ప్రసాద్ బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై మృతిచెందాడు. ఆయన కుటుంబానికి జనసేనపార్టీ జిల్లా నాయకుడు అతికారి కృష్ణ 20 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఈ మొత్తాన్ని అభి మానులు రవిశంకర్, చంద్ర బాధితులకు అందజేశారు.

కాల్పుల ఘటనపై హత్య కేసు నమోదు చేయాలి

రాయచోటిటౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కాటిమాయకుం ట- మాధవరం గ్రామాల మ ధ్య ఆదివారం తెల్లవారు జామున జరిగిన కాల్పుల ఘట నలో నిందితులపై హత్య కే సు నమోదు చేయాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహా య కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఉమ్మడి కడపజిల్లా కార్యదర్శి రాయచోటి రవిశంకర్, బహుజన సమాజ్ పార్టీ నాయకులు నాగార్జున, దళిత నాయకులు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ సంఘటనలో మృతి చెందిన హనుమంతు (45), గాయపడి చల్లారమణ కుటుంబాలను మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ మృతుడి కుటుంబానికి రూ.25 లక్షలు, తీవ్రంగా గాయపడిన రమణ కుటుంబానికి రూ.15 లక్షలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. వారి పిల్లలకు విద్య, వైద్యం ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పోలీ సు ఉన్నతాధికారులను కోరారు.

హత్య కేసు నిందితులను కఠినంగా శిక్షించాలి

గాలివీడు డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): కళాకారుడు మల్లెల వెంకట్రమణ హత్య కేసు నిందితులను కఠినంగా శిక్షించాలని బాధిత కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. హత్య కు సహకరించిన వారిపై కూడా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలంటూ వెంకట్రమణ మృతదేహాన్ని పోలీస్ స్టేషన్ ఎదుట ఉంచి నిరసన వ్యక్తంచేశారు. ఈ కేసులో ఎవరినీ వదలమని, ఇప్పటికే కొంత మందిని అదుపులోకి తీసుకున్నామని ఎస్‌ఐ రామకృష్ణ తెలపడంతో వారు ఆందోళన విరమించారు.

'కొత్త నేర చట్టాలతో పోలీసు రాజ్యం'

గాలివీడు, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన నూతన నేర చట్టాలతో దేశం పోలీసు రాజ్యంగా మారుతుందని భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడు సుబ్రమణ్యం వర్కింగ్ ప్రెసిడెంట్ టీ. ఈశ్వర్ ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం వెలిగల్లు ప్రాజెక్టు వద్ద ఉమ్మడి జిల్లాల న్యాయవాదుల సమావేశంలో వారు మాట్లాడారు. ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి మారుతీ ప్రసాద్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు రెడ్డెయ్య, రాజకుమార్‌రాజు, ఆనంద్‌కుమార్, కృష్ణయ్య, చిన్నయ్య, నాగముని తదితరులు పాల్గొన్నారు.

250 మామిడి మొక్కల నరికివేత

పెనగలూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పెనగలూరు మండలం వెలగచర్ల గ్రామ సర్వేనంబరు 678లోని ఐదెకరాల్లో దాది శ్రీనివాసులు మూడేళ్లుగా 250 మామిడి మొక్కలు సాగు చేస్తున్నాడు. సోమవారం అర్ధరాత్రి ఆ మొక్కలన్నింటినీ గ్రామానికి చెందిన కొందరు వ్య క్తులు నరికి వేసినట్లు బాధితుడు ఫిర్యాదు చేసినట్లు ఏఎస్‌ఐ రాముడు తెలిపారు. సంఘ టన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఆయన వివరించారు.

దాడి కేసులో వైసీపీ నాయకుల అరెస్ట్

నందలూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : దాడి కేసులో వైసీపీకి చెందిన ఓ నాయకుడి తోపాటు ఐదుగురిని అరెస్టు చేసినట్లు మన్నూరు సీఐ మహ్మద్‌అలీ తెలిపారు. గత శుక్రవారం చెయ్యేరునది సమీపంలో నిర్మిస్తున్న భవనం వద్ద గుంపుగా ఉండడంతో ఒంటిమిట్ట మండలం చిన్నకొత్తపల్లెకు చెందిన బ్రహ్మయ్య అక్కడికి వెళ్లాడు .దీంతో వైసీపీ నాయకుడు గండికోట వెంకట సుబ్బా రెడ్డి తదితరులు అతనిని కులం పేరుతో దూషించడంతో పాటు తీవ్రంగా గాయపరి చారు. ఈ కేసులో మంగళవారం ఆరుగురిని మన్నూరు పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సీ ఎస్టీ కేసు కావడంతో డీఎస్పీ స్థాయి అధికారి విచారణ చేస్తున్నట్లు సమాచారం.

సామాజిక సేవలో క్రైస్తవ మిషనరీలు

● విద్య,వైద్యమే ప్రామాణికంగా సామాజిక సేవలు
● చిరస్మరణీయుడు జాకబ్ చాంబర్లీన్



సీఎస్ఐ బాలికల ఉన్నత పాఠశాల


జాకబ్ చాంబర్లీన్

మదనపల్లె అర్బన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవ మిషనరీలు విద్య, వైద్య, ఆధ్యాత్మికంగా మదనపల్లెకు ఎనలేని సేవలు అందిస్తున్నాయి. ఈ మిషనరీలు ప్రజలకు ఎంతో ఉపయోగమైన పనులు చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నాయి. మదనపల్లె పట్టణాన్ని అన్ని రంగాల్లో ముందుకు నడిపిన ఆద్యుడు అమెరికాకు చెందిన డాక్టర్ జాకబ్ చాంబర్లీన్. అమెరికన్ ఆర్కాట్ మిషనరీ ఆధ్వర్యంలో 1860లో క్రైస్తవ మతం వ్యాప్తికి మదనపల్లెకు వచ్చారు. ఆయన స్వతహాగా వైద్యుడు. ఇందులో భాగంగానే గాంధీ రోడ్డులో 1861లో మిషన్ కాంపౌండ్ నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం జిల్లా ఆస్పత్రి ఉన్న స్థలంలో 1863లో చిన్న వైద్యశాలను ఏర్పాటు చేసి ఎంతోమంది నిరుపేదలకు ఉచితంగా వైద్యం అందించారు. దీంతో ఈ ప్రాంతంలో ఆయనకు మంచి పేరు ప్రఖ్యాతులు రావడంతో 1865లో తొలి క్రైస్తవ సంఘాన్ని ఏర్పాటు చేశారు. స్థానికంగా ఉన్న మిషన్ కాంపౌండ్‌లో సంఘాలు సమావేశం కావడానికి జ్ఞానోదయ క్షేత్రం ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడే మొదటిసారి క్రైస్తవ సువార్త కూటములు నిర్వహించారు. ఈ క్షేత్రాన్ని ఇప్పుడు పార్కుగా తయారు చేశారు. ఇప్పుడు కూడా క్రిస్మస్ పండుగ సందర్భంగా ఇక్కడ సమావేశాలు ఏర్పాటు చేస్తారు. 1901లో విద్య, వైద్యంతో పాటు ఆధ్యాత్మికతను జోడిస్తూ జేసీఎం చర్చిని నిర్మించారు.

113 ఏళ్లుగా వైద్య సేవలు

స్థానికంగా గాంధీ రోడ్డులోని ఎంఎల్ఎల్ ఆస్పత్రిని 1911లో క్రైస్తవ మిషనరీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఇది గోషా ఆస్పత్రిగా పేరు పొందింది. మిషనరీల ఆధ్వర్యంలో అప్పట్లో అమెరికా నుంచి పలువురు బ్రిటీష్ వారు వచ్చి వైద్యం అందించేవారు. డాక్టర్లు ఇక్కడే నివాసం ఉండి మదనపల్లెలోనే కాకుండా పరిసర ప్రాంతాల్లో వారికి వైద్యసేవలను అందించేవారు. ఎంతో మంది మదనపల్లె పరిసర ప్రాంతాల నుంచి గోషా ఆస్పత్రికి వచ్చి చికిత్సలు చేసుకునేవారు. ఇప్పుడు ఈ ఆస్పత్రి రాయలసీమ మిషనరీ ఆధ్వర్యంలో నడుస్తోంది. కాలానుగుణంగా వైద్య సేవల్లో వెనుకబడింది.

క్షయ నివారణకు ఆరోగ్యవరం మెడికల్ సెంటర్

క్రైస్తవ మిషనరీల ఆధ్వర్యంలోనే ఆరోగ్యవరంలో 1911లో సుమారు 170 ఎకరాల్లో ఆరోగ్యవరం మెడికల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో క్షయ చికిత్సకు కొత్త రకాల మందుల పరిశోధనలకు ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ ఎన్నో సేవలను అందించింది. దీంతో పాటు క్రైస్తవ మత వ్యాప్తి కోసం ఆరోగ్యవరంలో 1935లో సెయింట్ లూక్స్ చర్చిని, 1905లో గుడిసివారిపల్లెలో సెయింట్ పీటర్ చర్చిని నిర్మించారు. ఇవి ప్రస్తుతం రాయలసీమ డయాసిస్ బిషప్ ఆధీనంలో నడుస్తున్నాయి.

చాంబర్లిన్ సేవలు అమోఘం

క్రైస్తవ మత వ్యాప్తి కోసం ప్రజల్లో చైతన్యం తీసుకురావాలంటే వారు ఆరోగ్యంగా ఉంటూ విద్యను అభిసించినవారుగా ఉండాలన్న ఆలోచనలతోనే డాక్టర్ చాంబర్లీన్ సామాజికంగా విద్య, వైద్యం, ఆధ్యాత్మికంగా చేసిన సేవలు చిరస్మరణీయం. ఆ కాలంలో పేదలకు వైద్యం చాలా అవసరం దీనికంటే విద్య ఆవశ్యకతను గుర్తించిన డాక్టర్ చాంబర్లీన్ పాఠశాలను ఏర్పాటు చేసి పేదలకు విద్యను నేర్పేందుకు ఎనలేని సేవలు చేశారు.

- రెవరెండ్ డాక్టర్ సునీల్‌వరకుమార్, డివిజన్ సంఘ కాపరి

విద్యారంగానికి 144 ఏళ్లుగా సేవలు

మదనపల్లె పరసర ప్రాంతాల ప్రజలకు ఉచితంగా విద్యను అందించాలన్న ఉద్దేశ్యంతో జాకబ్ చాంబర్లీన్ విద్యారంగానికి ఎనలేని సేవలు చేశారు. స్థానిక చిత్తూరు బస్టాండ్‌లో 1880లో సీఎస్ఐ బాలికల ఉన్నత పాఠశాలను అందుబాటులోకి తెచ్చారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎంతోమందికి ఉచితంగా విద్యను అందిస్తోంది. అలాగే పట్టణంలోని అవెన్యూ రోడ్డులో 1881లో హోప్ ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేశారు. అప్పట్లో అధికంగా పేద విద్యార్థులు ఈ రెండు పాఠశాలల్లో చదువుకున్నారు. చదువుకోవడానికి పుస్తకాల కోసం లైబ్రరీని ఏర్పాటు చేశారు. జాకబ్ చాంబర్లీన్ ఆంగ్ల సాహితీవేత్త. లైబ్రరీ ఏర్పాటుకు ఆయన ఎంతో కృషి చేశారు. లైబ్రరీ ఉండడంతో ఈ ప్రాంతాన్ని ఇప్పటికీ రీడింగ్‌రూమ్ వీధిగా పిలుస్తున్నారు.



ఎంఎల్ఎల్ ఆస్పత్రి



మిషన్ కాంపౌండ్‌లో చాంబర్లీన్ స్థూపం

ముంపు సమస్యను ప్రభుత్వానికి నివేదిస్తాం : జేసీ


సోమశిల వెనుకజలాలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ అదితిసింగ్

ఒంటిమిట్ట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సోమశిల ప్రాజెక్టు కింద ముంపునకు గురయ్యే పెన్నపేరూరు గ్రామ ప్రజల సమస్యలను ప్రభుత్వానికి నివేదిస్తామని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ తెలిపారు. మంగళవారం పెన్నపేరూరు, తప్పెటవారిపల్లె గ్రామాలను ఆమె సందర్శించారు. ముందుగా ఇబ్రహీంపేటలో ఉన్న రహదారులను పరిశీలించి గ్రామాల్లోకి ఎంతవరకు నీరు వస్తుందన్న అంశంపై సోమశిల ఇంజనీరింగ్ అధికారులను ఆరా తీశారు.

అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన హద్దులను పరిశీలించారు. గ్రామస్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ జనాభా, ఇతర వివరాలను స్థానిక రెవెన్యూ అధికారులను అడిగి అని తెలుసుకున్నారు. పరిహారం కోసం పేర్లు నమోదు చేశారా అని సోమశిల ఇంజనీరింగ్ అధికారులను ప్రశ్నించగా, ఇప్పటివరకు ఎలాంటి నమోదు చేయలేదని సమాధానమిచ్చారు. ఈ సమస్యపై కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామని, అనంతరం ఓ సమావేశాన్ని ఏర్పాటు చేసి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో జాన్ ఎర్విన్, స్పెషల్ కలెక్టర్ శ్రీనివాసులు, సోమశిల ఎస్ఈలు వెంకటేశ్వర్‌రెడ్డి, రమణారెడ్డి, తహసీల్దారు వెంకట రమణమ్మ, ఆర్ఐ భాస్కర్‌రెడ్డి, వీఆర్వో అంజి, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణపై విచారణ

మండలంలోని ఓబులేశుకోనలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములపై జేసీ అదితి సింగ్ విచారణ చేశారు. మండల పరిధిలోని పెన్నపేరూరు రెవెన్యూ పరిధిలో ఉన్న ఓబులేశుకోనలో దాదాపు 120 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారి వివరాలను తెలపాలని తహసీల్దారు రమణమ్మను ప్రశ్నించగా. దాదాపు 10 నుంచి 20 మంది ఆక్రమించారని ఆయన సమాధానమిచ్చారు. సరైన వివరాలు తెలపాలంటూ తహసీల్దారు తోపాటు ఆర్డీవో జాన్‌ఎర్విన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆక్రమణదారులను రైతులని చెప్పడం ఏమిటని ఆమె ప్రశ్నించారు.

బీఎల్‌వోలకు తీపి కబురు!

● ఒక్కొక్కరికి రూ.12,750 వంతున విడుదల చేసిన ప్రభుత్వం
● 2021 నుంచి చెల్లించని వైసీపీ ప్రభుత్వం ● బీఎల్వోలందరికీ లబ్ధి

కలికిరి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రానున్న పండుగల వేళ బీఎల్‌వోలకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. రెండేళ్లుగా పేరుకుపోయిన బకాయిలను ఏకమొత్తంగా (డిసెంబరు వరకు) విడుదల చేస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో దాదాపు 1500 మంది బీఎల్‌వోలు (బూత్ లెవెల్ ఆఫీసర్లు) లబ్ధి పొందనున్నారు. ఒక్కో బీఎల్‌వోకు రూ.12,750 అందనున్నాయి. నేరుగా ఎన్నికల సంఘం రాష్ట్ర సీఈవో అజమాయిషీలో పనిచేస్తూ ఓటర్ల జాబితాల తయారీ నుంచి ఓటరు స్లిప్పుల పంపిణీ వరకు ఎన్నికల నిర్వహణలోనూ, పోలింగ్ సమయంలోనూ కీలకమైన విధులు నిర్వర్తిస్తున్న బీఎల్‌వోలకు గత ప్రభుత్వం రెండేళ్లకు పైబడి గౌరవ భృతి చెల్లించకుండా తాత్సారం చేసింది. అయినా గత సార్వత్రిక ఎన్నికల వరకు వీరు ఆర్థిక ప్రయోజనాలను పట్టించుకోకుండా బాధ్యతాయుతమైన విధులు నిర్వర్తించడంలో తలమునకలుగా పనిచేశారు. ఎన్నికలు పూర్తయిన తరువాత ఇప్పుడు మళ్లీ ఓటర్ల జాబితాల సవరణ బాధ్యతల్లో కొనసాగుతున్నారు. నాలుగేళ్ల క్రితం వరకూ బూత్ లెవెల్ ఆఫీసర్లుగా అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. అప్పట్లో బీఎల్‌వో బాధ్యతలు నిర్వర్తించినందుకు నెలకు రూ.250 చెల్లించేవారు. అదీ ఏడాదికో, రెండేళ్లకో నిధులు విడుదలయ్యేవి. 2022 జనవరి నుంచి ఈ గౌరవ భృతిని నెలకు రూ.500గా ఎన్నికల కమిషన్ పెంచింది. పేరుకు పెంచారేగానీ 2021 అక్టోబరు నుంచి ఈ గౌరవ భృతి కూడా చెల్లించడం లేదు. సచివాలయ వ్యవస్థ అందుబాటులోకి వచ్చిన అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలకు బదులుగా సచివాలయ ఉద్యోగులను నియమించారు. ఏళ్ల తరబడి పాతదిగానీ, కొత్తగా పెంచిన గౌరవ భృతి కానీ చెల్లించకపోవడంతో బీఎల్వోలు కూడా వెట్టిచాకిరీ చేస్తున్నామనే నైరాశ్యంతోనే పనిచేస్తూ వచ్చారు. అనూహ్య రీతిలో 2021 నుంచి 2024 డిసెంబరు వరకూ ఉన్న బకాయిలను ప్రభుత్వం తాజాగా విడుదల చేసింది.

మంగళవారం విడుదలైన ప్రభుత్వం ఉత్తర్వుల ప్రకారం ప్రతి బీఎల్వోకూ 2021-22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మూడవ త్రైమాసికానికి (అక్టోబరు, నవంబరు, డిసెంబరు మూడు నెలలకు) నెలకు రూ.250 ప్రకారం రూ.750 చెల్లించాలి. ఆ తరువాత అదే సంవత్సరం నాలుగవ త్రైమాసికం (2022 జనవరి, ఫిబ్రవరి, మార్చి) నుంచి 2023-24 మూడవ త్రైమాసికం వరకు నెలకు రూ.500 ప్రకారం మొత్తం రూ.12,750లు చెల్లించనున్నారు. ఈ మేరకు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వివేక్ యాదవ్ మంగళవారం జీవో జారీ చేశారు.

సబ్సిడీతో సోలార్ రూఫ్‌టాప్


సమావేశంలో మాట్లాడుతున్న అన్నమయ్య జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ రమణ

రాయచోటిటౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సబ్సిడీతో ఎస్సీ, ఎస్టీ వినియోగదారుల గృహాల ఇంటి పైకప్పు మీద సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసేందుకు ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందని జిల్లా విద్యుత్‌శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ రమణ తెలిపారు.

మంగళవారం రాయచోటి పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో జిల్లా విద్యుత్‌శాఖ అధికారులు, నెడ్‌క్యాప్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం గృహ వినియోగదారులకు మాత్రమే వర్తిస్తుందని తెలిపారు. ఈ పథకం ద్వారా గృహ వినియోగదారులకు ప్రభుత్వం సబ్సిడీ రాయితీని మంజూరు చేస్తుందని తెలిపారు. ఇంటిపైప్పుపైన కనీసం 10 చదరపు మీటర్ల 100 చదరపు అడుగుల స్థలంలో 1 కిలో వాట్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేయవచ్చునన్నారు. దీనికోసం వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకుని రాయితీ ద్వారా సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు.

జిల్లాలో 43,730 మంది ఎస్సీ వినియోగదారులు, 11,872 మంది ఎస్టీ వినియోగదారులతో కలిపి మొత్తం 55,602 మంది ఎస్సీ, ఎస్టీ వినియోగదారులు ఉన్నారన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జనవరి 10వ తేదీలోపు ఎస్సీ, ఎస్టీ వినియోగదారుల నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు లక్ష్యాన్ని నిర్దేశించుకుని పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ వినియోగదారులు ఎటువంటి రుసుం లేకుండా ఉచితంగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. సమావేశంలో విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, నెడ్‌క్యాప్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ యల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శభాష్... డాక్టర్ వెంకటరామయ్య

● రోడ్డు ప్రమాదంలో ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లిన యువకుడు
● సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన బి.కొత్తకోట వైద్యుడు


సీపీఆర్ చేస్తున్న డాక్టర్ వెంకటరామయ్య


సీపీఆర్‌తో కోలుకుంటున్న విద్యార్థి అనిల్

ములకలచెరువు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట ప్రభుత్వాస్పత్రి వైద్యుడు డాక్టర్ వెంకటరామయ్య ఓ ప్రాణాన్ని నెలబెట్టారు. రోడ్డు ప్రమాదానికి గురై ప్రాణాపాయ స్థితికి వెళ్లిన యువకుడిని సీపీఆర్ చేసి కాపాడారు. యువకుడి ప్రాణాలు కాపాడి ఆదర్శంగా నిలిచిన వైద్యుడిని ప్రజలు ప్రశంసించి అభినందనలు తెలుపుతున్నారు. వివరాల్లోకి వెళితే.... ములకలచెరువు మండలం కోనేటివారిపల్లెకు చెందిన యువకుడు అనిల్ (22) బీటెక్ చదువుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ద్విచక్రవాహనంలో వెళ్తుండగా ముంబాయి-చెన్నై జాతీయ రహదారిలోని అన్నమయ్య-శ్రీసత్యసాయి జిల్లాల సరిహద్దు సమీపంలో ఉన్న తనకల్లు మండలం చీకటిమానిపల్లె వద్ద మదనపల్లె నుంచి కదిరి వైపు వెళుతున్న లారీ ఢీకొని రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ ప్రమాదంలో యువకుడు తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరాడు. ఈ సమయంలో పని నిమిత్తం శ్రీసత్యసాయి జిల్లా కదిరికి ద్విచక్ర వాహనంలో వెళ్లి వస్తున్న బి.కొత్తకోట ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న డాక్టర్ వెంకటరామయ్య యువకుడి వద్దకు వచ్చారు. యువకుడు ఊపిరి తీసుకోవడం ఆపేస్తుండడాన్ని గమనించి వెంటనే సీపీఆర్ చేసి ప్రాణం పోశారు. అలాగే 108కు ఫోన్ చేసి చికిత్స నిమిత్తం తనకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం యువకుడి ఆరోగ్యం కుదుటపడుతోంది. డాక్టర్ వెంకటరామయ్య యువకుడి పాలిట దేవుడిగా వచ్చి ప్రాణం పోశారని అక్కడున్న వారు అభినందించారు.

ఎర్రచందనం స్మగ్లర్ అరెస్టు



ఒంటిమిట్ట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్న స్మగ్లర్‌ను ఒంటిమిట్ట పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఎస్ఐ శివప్రసాద్ తెలిపిన వివరాల మేరకు 2023లో ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో నిందితుడైన బద్వేలుకు చెందిన పెరుగు లక్ష్మీనరసయ్య అప్పటి నుంచి తప్పించుకు తిరుగుతున్నాడు. మంగళవారం అతడిని అరెస్టు చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి, రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

మల్చింగ్ షీట్‌తో బొప్పాయి సాగు..

ఆదాయం బాగు

● భూమిలోని తేమ త్వరగా ఆవిరి కాకుండా చేస్తుంది ● సూక్ష్మజీవులను నశింపజేయడం వంటి లాభాలు

మల్చింగ్ షీట్ వస్తూనే సమాచారం ఇస్తాం



మల్చింగ్ షీట్ సబ్సిడీతో వస్తూనే రైతులకు సమాచారం అందిస్తాము. ప్రస్తుతం సబ్సిడీలు వస్తాయని ఆశిస్తున్నాము. రైతులు మల్చింగ్ షీట్‌పై మక్కువ చూపుతున్నారు. చాలామంది రైతులు వీటిని అడుగుతున్నారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపుతాము.

- భాస్కర్, రైల్వేకోడూరు ఉద్యానశాఖాధికారి

మొదటిసారి వేశాము



బొప్పాయి సాగుకు మల్చింగ్ షీట్‌ను మొదటిసారి వేశాము. లాభాలు ఉన్నాయని చాలామంది రైతులను ఆదర్శంగా తీసుకుని వేశాము. ఉద్యానశాఖ అధికారులు సూచనలు, సలహాలతో పాటు కొందరు మల్చింగ్ షీట్ వేసిన రైతులను అడిగి ఎలా వేయాలో తెలుసుకుని సాగు చేపట్టాము.

- మన్నూరు తేజ, రైతు, ఓబనపల్లె


రైల్వేకోడూరు మండలంలో మల్చింగ్‌షీట్‌తో సాగవుతున్న బొప్పాయి తోట

రైల్వేకోడూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మల్చింగ్ షీట్‌తో బొప్పాయి సాగును చాలామంది రైతులు చేస్తున్నారు. గతంలో అన్ని ఉద్యాన పంటల మాదిరిగానే సాధారణంగా బొప్పాయిని రైతులు సాగు చేసే వారు. తీవ్ర కలుపు మొక్కలతో రైతులు కూలీలు పెట్టి తొలగించేవారు. కూలీలు దొరకని సమయంలో మినీ ట్రాక్టర్‌తో తొలగించే వారు. ఇది పెద్ద ఖర్చుతో కూడుకున్నదని రైతులు పలు ఇబ్బందులు పడేవారు. అయితే రానురాను వ్యవసాయ రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా రైతులు బొప్పాయి సాగును వినూత్నంగా మల్చింగ్ షీట్‌తో సాగు చేస్తున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో సుమారు 15 వేల హెక్టార్లలో బొప్పాయి సాగును రైతులు చేస్తున్నారు. ఎకరాకు మల్చింగ్ షీట్ 5 రోల్సు పడతాయి. మొదట నేలను బాగా దున్నిన తర్వాత డ్రిప్ పైపులు పరుస్తారు. దానిపై మట్టి బొదెలు వేస్తారు.

మల్చింగ్ షీట్ పరుస్తారు. మల్చింగ్ షీట్‌కు మధ్య, మధ్యలో రంధ్రాలు ఉంటాయి. ఆ రంధ్రాల్లో మొక్కలు నాటుతారు. డ్రిప్ పైపుల ద్వారానే నీరు, ఎరువులు మొక్కలకు అందుతాయి. మల్చింగ్ షీట్ తో కలుపు నివారణ అవుతుంది. భూమిలో తేమ త్వరగా ఆవిరి కాకుండా చేస్తుంది. అదే కాకుండా పంటకు హానికరమైన సూక్ష్మజీవులను నశింపజేస్తుంది. మల్చింగ్ షీట్‌లో పలు రకాలుగా ఉంటాయి. ఇందులో మొదటి రకం ఒక్క రోలు రూ.4 వేలు, రెండో రకం రూ.3 వేలు, మూడో రకం రూ.1300 ఉంటుంది. పొలంలో మొదట డ్రిప్ పైపులు వేసి అనంతరం బోదెలు వేసిన తర్వాతే మొక్కలు నాటాల్సి ఉంటుంది. ఎకరాకు 5 రోల్సు పడతాయి. లాభాలు కురిపించడమే కాకుండా కలుపు నివారణ తో పాటు తేమ త్వరగా ఆవిరి కాకుండా చేయడం, సూక్ష్మజీవులను నశింపజేయడం వంటివి రైతులకు మేలు చేస్తున్నాయి.

మల్చింగ్ షీట్‌కు డిప్ ఇరిగేషన్ చాలా సౌలభ్యంగా ఉంటుంది. మొక్కలు ఏపుగా పెరగడమే కాకుండా దృఢంగా ఉంటాయి. కాయల దిగుబడి బాగా వస్తుంది. మొక్కలకు అవసరమైన నీటిని మాత్రమే తీసుకుంటుంది. నీటిని పారగట్టడం వల్ల తేమ ఎక్కువగా ఉంటుంది. దీంతో బొప్పాయి మొక్కలకు అనుకూలంగా ఉండదు. కొందరు రైతులు డ్రిప్ ఇరిగేషన్ వైపు మక్కువ చూపిస్తున్నారు. చాలామంది రైతులు డ్రిప్ ఇరిగేషన్ వైపు మొగ్గు చూపాలని ఉద్యాన అధికారులు చెబుతున్నారు. మల్చింగ్ షీట్‌తో బొప్పాయి సాగు చేయడంతో లాభాలు ఉన్నాయని గుర్తించి రైతులు అందరూ ఇలాంటి సాగు చేస్తున్నారు. ప్రభుత్వం సబ్సిడీపై మల్చింగ్ షీట్ ఇస్తే ఉపయోగకరంగా ఉంటుందని పలువురు రైతులు కోరుతున్నారు.

మల్చింగ్ షీట్‌తో లాభాలు



మల్చింగ్ షీట్‌తో రైతులకు లాభాలు వస్తాయి. డ్రిప్ సౌకర్యంతో చక్కగా మొక్కలు పెరుగుతాయి. దీనివల్ల కాయల దిగుబడి బాగా వస్తుంది. ఇదే మొదటిసారిగా మల్చింగ్ షీట్ వేశాము. ఎరువులు డ్రిప్ ద్వారానే నేరు గా మొక్కలకు అందే విధంగా చేస్తున్నాము. దీంతో మంచి నాణ్యత గల కాయలను వినియోగదారులకు అందించవచ్చు.

- సొల్లేటి నరసింహులు, బొప్పాయి రైతు, ఓబనపల్లె

ఇతర రాష్ట్రాల్లో బొప్పాయికి డిమాండ్



ఇతర రాష్ట్రాల్లో బొప్పాయికి మంచి డిమాండ్ ఉంది. దీంతో ఎక్కువగా రైల్వేకోడూరు ప్రాంతంలలోని రైతులు బొప్పాయి పంటను పండిస్తున్నారు. బొప్పాయిలో ఎక్కువగా కలుపు వస్తుంది. దీంతో రైతులు ఎక్కువగా కూలీలకు డబ్బులు వెచ్చించాల్సి వస్తోంది. మల్చింగ్ షీట్‌తో అయితే అనేక లాభాలు ఉన్నాయి. అందువల్ల దీనితోనే సాగు చేపట్టాము.

- కట్టా శివయ్యనాయుడు, బొప్పాయి రైతు, రైల్వేకోడూరు

మిఠాయికి బూజు!

తనిఖీ చేపట్టిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ● ల్యాబ్‌కు శాంపిల్స్


ల్యాబ్‌కు తరలించేందుకు సీజ్ చేసిన మిఠాయి ప్యాకెట్లు

ప్రొద్దుటూరు రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు శివారులోని కొత్తపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న ఓ షాపింగ్‌మాల్‌లో కొనుగోలు చేసిన మిఠాయి (లాల్‌మైసూర్‌పాక్) ప్యాకెట్ బూజు పట్టిందని కొనుగోలుదారుడు ఆరోపించారు. పాడైన తినుబండారాలను అమ్ముతున్న విషయాన్ని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లగా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ హరిత, రూరల్ పోలీసు స్టేషన్ ఎస్ఐ మహమ్మద్‌రఫి షాపింగ్‌మాల్‌లో తనిఖీ చేపట్టారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. కడప వాసి శ్రీకాంత్, నరేంద్ర, మరికొందరు ప్రొద్దుటూరుకు వచ్చి షాపింగ్‌మాల్‌లో వస్తువులను కొనుగోలు చేశారు. నిత్యావసర వస్తువులు, పిల్లల అవసరార్థం లాల్‌మైసూర్‌పాక్‌ను కొనుగోలు చేసినట్లు చెప్పారు. స్టోర్ లోపల ప్యాక్‌ను ఓపెన్ చేసేందుకు ప్రయత్నించగా సిబ్బంది అభ్యంతరం చెప్పారని, దీంతో నగదును చెల్లించి బయటకు వచ్చి ప్యాకెట్ ఓపెన్ చేస్తే మిఠాయికి బూజు పట్టి ఉందని ఆరోపించారు. దీనిపై సిబ్బందిని ప్రశ్నించగా మేనేజర్ రావాలి, ఆయన సమాధానం చెబుతారు అంటూ విషయాన్ని దాటవేసి బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని వివరించారు. కస్టమర్లకు కనీస మర్యాద ఇవ్వకుండా మాట్లాడారని వాపోయారు. విషయం తెలిసిన ప్రొద్దుటూరు ఇన్‌స్పెక్టర్ హరిత, రూరల్ ఎస్ఐ మహమ్మద్‌రఫీ మంగళవారం షాపింగ్‌మాల్‌లో తనిఖీ చేపట్టారు. ఎనిమిది మిఠాయి ప్యాకెట్లను సీజ్ చేసి టెస్టింగ్ నిమిత్తం ల్యాబ్‌కు పంపించనున్నట్లు తెలిపారు.

వేడుకగా ఈశ్వరీదేవి గురుపూజోత్సవాలు

రూ.10లక్షలు విరాళం ఇచ్చిన టీడీపీ నేత కానాల మల్లికార్జునరెడ్డి


దాతను సన్మానిస్తున్న మఠం యాజమాన్యం

బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జగన్మాత ఈశ్వరీదేవి అమ్మవారి 235వ ఆరాధన గురుపూజా మహోత్సవాలు వేడుకగా నిర్వహిస్తున్నారు. మూడోరోజు అమ్మవారు సజీవ సమాధి నిష్ఠ వహించిన పవిత్ర దినం కావడంతో ఆలయ ప్రాంగణలో మఠాధిపతి వీరశివకుమార స్వాముల దంపతుల ఆధ్వర్యంలో కుంకుమ పూజ చేపట్టారు. కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని కుంకుమార్చనలో పాల్గొన్నారు.

మఠం అభివృద్ధికి రూ.10లక్షలు విరాళం

డి.అగ్రహారం టీడీపీ మండల నేత కానాల మల్లికార్జునరెడ్డి ఈశ్వరిదేవి అమ్మవారి మఠం అభివృద్ధికి తన వంతు రూ.10లక్షలు ఆర్థిక సాయం ప్రకటించారు. మంగళవారం ఆయన కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, వెల్లటూరు సాంబశివారెడ్డి, రేకలకుంట శివయాదవ్, చిలమల నాగయ్య, చెన్నుపల్లి జయరామిరెడ్డి, పూజా శివాయాదవ్, మస్తాన్‌యాదవ్, గంగరాజుయాదవ్, మేకల సుధాకర్ యాదవ్, మఠాధిపతి సంపత్ కుమార్ తదితర భక్తులు పాల్గొన్నారు.

కరుణామయ పిల్లల ఆశ్రమంలో మినీ క్రిస్మస్


పిల్లలకు దుప్పట్లు, బెడ్‌షీట్లు, స్కూల్ బ్యాగులు పంపిణీ చేస్తున్న ప్రముఖ జ్యోతిష్య నిపుణుడు సురేష్‌బాబు

కడప కల్చరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కడప నగర తోళ్లగంగనపల్లె వద్దగల మెర్సీ కరుణామయ ఆశ్రమంలో మంగళవారం మినీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ జ్యోతిష్య నిపుణుడు ఎం. సురేష్ బాబు హాజరై మాట్లాడారు. మనమంతా క్రీస్తు బాటలో నడవాలన్నారు. పరలోక రాజ్యం చిన్నపిల్లలదే అన్నారు. ప్రతి ఒక్కరూ తమకున్న దానిలో కాసింతైనా అనాథ చిన్న పిల్లలకు దానం ఇవ్వాలన్నారు. అప్పుడే దేవుని అనుగ్రహం లభిస్తుందన్నారు. అనంతరం క్రిస్మస్‌కేక్ కట్‌చేసి చిన్న పిల్లలకు పంపిణీ చేశారు. కొత్త బట్టలు, స్కూల్ బ్యాగులు, బెడ్‌షీట్స్, పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫాదర్స్ విజయరావు, చంద్ర, సుధాకర్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం పాలిటెక్నిక్ విద్యార్థుల విజయం


ప్రొద్దుటూరు డీఎస్పీ ద్వారా మెమెంటో అందుకుంటున్న విజేతలు

సింహాద్రిపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పాలిటెక్నిక్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్(ఐపీఎస్‌జీఎం)-2024 ఉమ్మడి కడప జిల్లా స్థాయి క్రీడల పోటీల్లో సింహాద్రిపురం పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు విజయం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ తాతాజీ తెలిపారు. ప్రొద్దుటూరులో నిర్వహించిన ఐపీఎస్‌జీఎం క్రీడల్లో మా కళాశాల విద్యార్థులు అనేక విభాగాల్లో ప్రతిభ కనపరచి ప్రథమ స్థానాల్లో నిలిచినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. మా విద్యార్థులు అత్యంత ప్రతిభ కనపరచి వాలీబాల్ జట్టు విజేతలుగా నిలిచారు. డిస్కస్‌త్రోలో కౌసిక్ కుమార్‌రెడ్డి ప్రథమ స్థానం, 100మీటర్ల రిలేలో వర్ధన్, భరత్, స్టాలిన్, మధుసూదన్ ద్వితీయ స్థానం, 200మీటర్ల పరుగు పందెంలో వర్ధన్ ద్వితీయ స్థానం, 100మీటర్ల పరుగులో వర్ధన్ తృతీయ స్థానం, షాట్‌పుట్, లాంగ్ జంప్‌లో కార్తీక్‌రెడ్డి తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలు ప్రొద్దుటూరు డీఎస్పీ భక్తవత్సలం ద్వారా బహుమతు లు అందుకున్నారని ప్రిన్సిపాల్ తెలిపారు. క్రీడా పోటీల విజేతలను, ప్రిన్సిపాల్ తాతాజీ, అధ్యాపకులు అభినందించారు. క్రీడల్లో విజేతలుగా నిలిచేందుకు కృషి చేసిన ఫిజికల్ డైరెక్టర్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రిన్సిపాల్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

కర్నూలు ఫారెస్టు సర్కిల్ ప్రతినిధిగా శ్రీపతి ఓబులేసు



కడప క్రైం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తిరుపతిలో జరిగిన ఏపీ జూనియర్ ఫారెస్టు ఆఫీసర్స్ అసోసియేషన్ స్టేట్ బాడీ ఎన్నికల్లో కడప అటవీ డివిజను నుంచి కర్నూలు సర్కిల్ ప్రతిని ధిగా శ్రీపతి ఓబులేసును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ కర్నూలు సర్కిల్‌లోని కడప, ప్రొద్దుటూరు, నంద్యాల, కర్నూలు అటవీ డివిజన్‌లోని ఫారెస్టు సిబ్బంది సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారా నికి కృషి చేస్తానన్నారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

కాలుజారి పడి మహిళ మృతి



సుండుపల్లె, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గుట్టపై ఉన్న ఆలయానికి వెళుతుండగా కాలు జారి కింద పడడంతో ఓ మహిళ మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. పెద్దినేని కాలువ పంచాయతీ బెస్తపల్లి వాసి బెస్తల నాగమునెమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. మం గళవారం తెల్లవారుజామున ఓబులేసుగుట్టపై ఉన్న ఓబులేశ్వరస్వామి (శివుడు)ని దర్శించుకునేందుకు బయలుదేరింది. మార్గమధ్యలో కా లు జారి కిందపడి అక్కడికక్కడే మరణించింది. ఈ మేరకు కుటుం బ సభ్యులు ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు సుండుపల్లె ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు.

శ్రీవారి కల్యాణం

చురుగ్గా ఏర్పాట్లు
నేడు కుంకుమార్చన, నిశ్చితార్థం
రేపు కల్యాణం, గ్రామోత్సవం


అన్నమయ్య విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్న గోవిందమాల భక్తులు

కడప ఎన్టీఆర్ సర్కిల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవ నిర్వహణకు కడప మున్సిపల్ స్టేడియంలో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. నగరంలోని గోవిందమాల భక్త బృందం సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీవారి భక్తుల సహకారంతో 14ఏళ్లగా వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 15వ వార్షికోత్సవం పురస్కరించుకుని 25,26వ తేదీల్లో కల్యాణోత్సవం నిర్వహిస్తున్నారు. నియమ, నిష్ఠలతో దీక్ష పరులైన గోవిందమాల భక్తులు శ్రీవారి ఐక్యతగా పూజలు నిర్వహిస్తూ కల్యాణంలో పాల్గొనాలని భక్తులకు ఆహ్వానం పలుకుతున్నారు. స్వామివారి కల్యాణం విజయవంతం చేసేందుకు ప్రతి కుటుంబం బాధ్యత చేపట్టాలని నిర్వాహకులు కోరారు. మంగళవారం నగరంలోని అన్నమాచార్యుల విగ్రహానికి పూజలు నిర్వహించారు.

నేడు నిశ్చితార్థం

రెండు రోజులు వైభవంగా నిర్వహించనున్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ క్రతువులో భాగంగా బుధవారం ఉదయం ఐదు గంటలకు సుప్రభాత సేవతో కార్యక్రమాలు మొదలవుతాయి. 5.30గంటలకు కొలువు అర్చన ప్రారంభమవుతుంది. 7.30కు గోపూజ, 8కి మూల వర్లకు అభిషేకం, వస్త్రాలంకరణ 9.30 గంటలకు నిశ్చితార్థం, 12 గంటలకు తిరుప్పావై, సాయంత్రం 5గంటలకు సువాసినిల చేత సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తారు. ఆసక్తి ఉన్న మహిళలు ఎవరైనా పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తారు. 6.30గంటలకు ఎదురు కోలోత్సవం నిర్వహిస్తారు.

రేపు కళ్యాణం, గరుడ సేవ

26వ తేదీ గురువారం ఉదయం 9గంటలకు పచ్చటి తోరణాలు, మంగళవాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చారణ, అన్నమయ్య సంకీర్తన మధ్య శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. కల్యాణోత్సవానికి వచ్చిన భక్తులకు గోవిందమాల భక్త బృంద సేవా సమితి ఆధ్వర్యంలో ప్రసాద వితరణ జరుగుతుంది. సాయంత్రం గ్రామోత్సవంలో భాగంగా శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారికి గరుడ సేవ నిర్వహించనున్నారు. కోలాటాలు, చెక్కభజనలు, పంచ వాయిద్యాలు, బ్యాండు మేళాలు, బాణసంచా వెలుగుల మధ్య మున్సిపల్ స్టేడియం నుంచి ప్రారంభమయ్యే గ్రామోత్సవం శంకరాపురం, చిన్నచౌకు, వై జంక్షన్, ఎన్జీఓ కాలనీ, అప్సర సర్కిల్ మీదుగా అన్నమయ్య సర్కిల్ వరకు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.


శ్రీవారి కల్యాణానికి ముస్తాబవుతున్న వేదిక

కల్యాణోత్సవం విజయవంతం చేయండి



శ్రీ వారి కల్యాణాన్ని విజయవంతం చేయాలి. కడప నగరంలోని మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్న శ్రీవారి కల్యాణంలో ప్రతి ఒక్కరూ పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కాగలరు. గ్రామోత్సవంలో దీప హారతి పట్టేందుకు మహిళలకు అవకాశం ఉంది. ప్రతి ఒక్కరూ కల్యాణోత్సవంలో పాల్గొనడం శుభకరం.

పుల్లారెడ్డి, చైర్మన్ గోవింద మాల భక్త బృందం సేవా సమితి, కడప

బాధలు భరించలేకే హత్య

కుమారుడి హత్య కేసులో తండ్రి సహా ముగ్గురి అరెస్ట్ ● వివరాలు వెల్లడించిన సీఐ


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసులు

పుంగనూరు, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): కుమారుడి వేధింపులు భరించలేక కన్నతండ్రే బిడ్డను సుపారీ ఇచ్చి హతమార్చిన కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. సీఐ కథనం మేరకు... అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం కోళ్లబైలు పంచాయతీ దిగువమామిడిగుంపులపల్లె వాసి గంగులరెడ్డి కుమారుడు సోమశేఖరరెడ్డి(36) చిన్నతనం నుంచి చెడు అలవాట్లకు బానిసై తరచూ గొడవలు పడేవాడు. పదేళ్ల కిందట వివాహం చేయగా సోమశేఖర్‌రెడ్డి పెట్టిన చిత్రహింసలు భరించలేక భార్య, ఐదేళ్ల కుమారుడు బావిలో దూకి చనిపోయారు. దీనిపై మదనపల్లె తాలూకా పోలీసులు సోమశేఖరరెడ్డి, అతడి తండ్రి గంగులరెడ్డిపై కేసు నమోదు చేసి జైలుకు పంపారు. జైలు నుంచి వచ్చాక కూడా సోమశేఖరరెడ్డి మద్యానికి బానిసగా మారి గ్రామంలో అందరితో ఘర్షణ పడేవాడు. తనకు రెండో పెళ్లి చేయాలని తల్లిదండ్రులను తరచూ దుర్భాషలాడుతూ కొట్టేవాడు. ఈ బాధలు భరించలేక గంగులరెడ్డి తన కుమారుడు సోమశేఖరరెడ్డిని చంపేస్తే పీడ విరగడవుతుందని నిర్ణయించుకున్నాడు. పుంగనూరు మండలం చంద్రమాకులపల్లె పంచాయతీ గానుగులగడ్డకు చెందిన ఆటో డ్రైవర్ ఎం. అమరనాథ్, ఎం.రమేష్, ఫణేంద్రనాయక్‌తో మాట్లాడి రూ.35వేలకు బేరం కుదుర్చుకున్నాడు. ఇందులో భాగంగా అమరనాథ్ ఆటోలో సోమశేఖరరెడ్డిని బోయకొండ అటవీప్రాంతానికి తీసుకెళ్లి రాళ్లతో కొట్టి హత్య చేసి గుంతలో పడవేసి మృతదేహం కనిపించకుండా బోదగడ్డితో కప్పారు. ఈ నెల 20 తేదీ అటవీ ప్రాంతంలో ఓ మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఎముకల గూడుగా కన్పించినట్లు పోలీసులకు చంద్రమాకులపల్లె వీఆర్వో శ్రీనివాసులు ఫిర్యాదు చేశారు. పుంగనూరు పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి సోమశేఖరరెడ్డి శవంగా గుర్తించారు. దీనిపై దర్యాప్తు చేసి సోమవారం రాత్రి హతుడి తండ్రి గంగులరెడ్డి, ఆటో డ్రైవర్ అమరనాథ్, ఎం, రమేశ్‌ను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

17 ఏళ్లుగా పరిహారం కోసం ఎదురుచూస్తున్నాం...

● జేసీ ఎదుట ముంపువాసుల ఆవేదన


చింతువాండ్లపల్లెలో జేసీ ఎదుట ముంపుబాధితుల ఆవేదన

అట్లూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): 17 సంవత్సరాలుగా ముంపు పరిహారం కోసం ఎదురు చూస్తున్నామని జాయింటు కలెక్టరు అధితిసింగ్ ఎదుట ముంపువాసులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. సోమశిల రిజర్వాయరులో ప్రభుత్వం 78 టీఎంసీలు నిల్వ ఉంచాలని అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో ముంపు గ్రామాలైన చింతువాండ్లపల్లె, ఆకుతోటపల్లె గ్రామాలను జేసీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ఎదుట ముంపు వాసులు తమ గోడు వెల్లబోసుకున్నారు. 2007 సంవత్సరంలో మా గ్రామాలను ముంపు గ్రామా లుగా అధికారులు ప్రకటించారని, 78 టీఎంసీలు నిల్వ ఉంచితే మా గ్రామాల్లోకి మూడు అడుగులు సోమశిల వెనుక జలాలు చేరుతాయన్నారు. దీంతో ఊర్లలో పాములు, రకరకాల విషసర్పాలు రావడంతో దాదాపు ముగ్గురు నలుగురు కూడా గతంలో చనిపోయారన్నారు. చింతవాండ్లపల్లెకు 158 ఇళ్లకు, ఆకుతోటపల్లె 400 గృహా లకు పరిహారం చెల్లించాలని ఆమె ముంగిట వెల్లడించారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఎన్నో మార్లు ముంపుజలాలు గ్రామాల్లో చేరినా అధికారులు పరిశీ లించి వెళ్లారు తప్ప న్యాయం చేయలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకుని మాకు పరిహారం అందేలా చూడాలన్నారు. ఇందుకు జేసి స్పందించి పైఅధికారులకు నివేదికలు అందజేస్తామని తెలిపారు. సోమశిల ప్రాజెక్టు ఎస్ఈ వెంకటరావిరెడ్డి, ఈఈ రమణారెడ్డి, స్పెషల్ కలెక్టరు శ్రీనివాసులు, బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్, అట్లూరు తహసీల్దారు సుబ్బలక్షుమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్రిక్తతల నడుమ సమావేశం

ఇద్దరు టీడీపీ నేతలకు గాయాలు ● వైసీపీ నేతపై కేసునమోదు ● పోలీసుల వైఫల్యమే కారణం : టీడీపీ శ్రేణులు


బారికేడ్లను తోసుకువెళ్తున్న వైసీపీ నేతల వాహనాలు

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 24 (ఆంధ్ర జ్యోతి): పీటీఎంలో మంగళవారం మండల సమావేశం ఉద్రిక్తతల నడుమ కొన సాగింది. కోర్టు ఆదేశాలతో సమావేశం చేసుకోవాలని ఆదేశించడంతో మంగళవారం ఉదయం వైసీపీ నేతలు పక్కా పథకం ప్రకారం తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి జనాన్ని పీటీఎంకు పిలిపించుకుని మండల సమావేశం జరిగే సమావేశ ప్రదేశానికి ఒక్క సారిగా దూసుకొచ్చారు. వైసీ పీ శ్రేణులను నిలువరించే క్రమంలో ఇద్దరు టీడీపీ నేతలకు గాయాలయ్యాయి. ఉదయం నుంచే పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేసి సమావేశానికి హాజరయ్యే ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా పరిశీలించారు. వైసీపీ నేతలు కోర్టు అనుమతులతో మండల సమావేశాన్ని నిర్వహిస్తున్నామని అత్యుత్సాహం ప్రదర్శించారు. వైసీపీ నేతల పథకం ప్రకారం ఉదయం నుంచే సమావేశ మం దిరానికి కూతవేటు దూరంలో ఓ ప్రైవేటు భవనంలో మాటు వేసి సమావేశం నిర్వహించే సమయానికి బారికేడ్లను తోసుకుంటూ వారి వాహనాల్లో లోపలికి చొచ్చుకు పోయారు. టీడీపీ నేతలు వారిని నిలువరించాలని ప్రయత్నం చేయగా పోలీసులు, వైసీపీ నేతలు, టీడీపీ నేతల నడుమ తోపులాట జరిగింది. దీంతో ఇద్దరు టీడీపీ నేతలకు గాయాలయ్యాయి. వైసీపీ నేతలు ఎట్టకేలకు మండల సమావేశానికి చేరుకుని వైసీపీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో కలిసి సమావేశాన్ని నామమాత్రంగా నిర్వహించి చేతులు దులిపేసుకున్నారు. ఎంపీపీ మహమూద్ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించినట్లు అధికారులు కొద్ది మంది మాత్రమే హాజరవడంతో హాజరైన సభ్యులతో సంతకాలు చేయించి మమ అనిపించారు. అనంతరం వైసీపీ శ్రేణుల వాహనాల తాకిడితో గాయపడిన టీడీపీ నేతలు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. వైసీపీ నేతలు పథకం ప్రకారం ప్రజా ప్రతినిధులు కాని వారు పీటీఎంలో అల్లర్లు సృష్టించారని తమపై కావాలనే వాహనాలతో దాడి చేశారని ఆరోపించారు. వైసీపీ నేతల అరాచకాలు ఇంకెన్నాళ్లని ప్రశ్నించారు. తాము అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నట్లుగా వైసీపీ నేతలు దాడి చేస్తున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారన్నారు. పోలీసుల వైఫల్యంతోనే ఇదంతా జరిగిందంటూ టీడీపీ నేతలు ఆరోపించారు. టీడీపీ నేత రాపూరివాండ్లపల్లె గ్రామం కొత్తప ల్లెకు చెందిన పప్పు రాజారెడ్డి ఫిర్యాదుపై వైసీపీకి చెందిన తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి పీఏగా పని చేసిన ప్రవీణ్ కుమార్‌రెడ్డి అలియాస్ పాపిరెడ్డి ఇతను అంగళ్లు అల్లర్ల కేసులో టీడీపీ నేతలకు ప్యాంట్ జిప్పు ఇప్పి చూపించిన వ్యక్తి ఇతను తమ అనుచరులతో వచ్చి అల్లర్లు సృష్టించి టీడీపీ నేతలను పథకం ప్రకారమే తన అనుచరులతో బారికేడ్లను వాహనాలతో తోసుకుంటూ వెళ్లారన్నారు. సమావేశాన్ని ముగించిన అనంతరం వైసీపీ శ్రేణులు బయటి వ్యక్తులు అంతా రావడంతో భారీగా నినాదాలతో వెళుతున్నా పోలీసులు వారిని నిలవరించకుం డా మిన్నకుండి పోయారని టీడీపీ నేతలు ఆరోపించారు. గాయ పడిన ఇద్దరిలో పీటీఎంకు చెందిన పాలగిరి రామాంజులు, మరొకరు రాపూరివాండ్లపల్లె పంచాయతీ కొత్తపల్లెకు చెందిన పప్పు రాజారెడ్డి గాయపడిన వారిని తంబళ్లపల్లె నియోజకవర్గం టీడీపీ నేత దాసిరిపల్లె జయచంద్రారెడ్డి పీటీఎంకు చేరుకుని వారిని పరామర్శించి ప్రమాదానికి కారణమైన వైసీపీ నేతలపై కేసు నమోదు చేయాలని పోలీసులను కోరారు.

పాముకాటుతో మహిళ మృతి


గంగమ్మ మృతదేహం

వల్లూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పెద్దలేబాక గ్రామంలో పాముకాటుతో మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... పెద్దలేబాక వాసి పెండ్లిమర్రి గంగమ్మ(60) సోమవారం ఇంట్లో నేలపై నిద్రిస్తుండగా తెల్లవారుజామున పాము కాటు వేసింది. ఆమె బంధువులు పామును గుర్తించి చంపేశారు. వెంటనే కమలాపురంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ఆమెకు ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతదేహాన్ని మంగళవారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

సీఐ డ్రైవర్‌పై లైంగిక వేధింపుల కేసు నమోదు

కొండాపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కొండాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో డ్రైవర్‌గా పనిచేస్తున్న రాయుడుపై లైంగిక వేధింపుల కేసు నమోదైంది. చౌటిపల్లె మహిళ తనను సీఐ డ్రైవర్ కొంతకాలంగా ఫోన్‌లో లైంగికంగా వేధిస్తున్నాడని ఎస్పీకి ఫిర్యాదు చేసింది. అంతేకాకుండా గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ భర్త ఓంకార్ కూడా తనను వేధిస్తున్నాడని బాధిత మహిళ ఆరోపించింది. ఈ విషయం ప్రస్తుతం విచారణ జరుగుతున్నట్లు పోలీసులు చెప్పారు. ఈమెపై గతంలో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈమెపై కేసు ప్రస్తుతం విచారణలో ఉందన్నారు. కాగా డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, విచారిస్తున్నట్లు ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు.

మిట్స్ అధ్యాపకుడికి డాక్టరేట్ ప్రదానం



కురబలకోట, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ప్రిన్సిపాల్ సి.యువరాజ్ పేర్కొన్నారు. కళాశాలలో ఎంసీఏ అసిస్టెంట్ ప్రొఫెసర్ మెహమ్మద్ షకీబ్ యూపీలోని అలీఘర్ ముస్లిం యూనివర్శిటీలో 'యాన్ ఎఫిసియెంట్ ఎసెంబ్లీ డీప్ లెర్నింగ్ మోడల్ ఫర్ ఎస్టిమేట్ అండ్ ఫోర్‌క్యాస్టింగ్ ఆఫ్ టైమ్ సీరిస్ డేటా' అంశంపైన పరిశోధన చేసి సమర్పించారు. దీంతో ఆయనకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఆయనను కరెస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి, ప్రిన్సిపాల్ యువరాజ్, విభాగాధిపతి నవీన్‌కుమార్ తదితరులు అభినందించారు.

పీఈటీ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

మైలవరం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గురుకుల ఉన్నత పాఠశాలల పీఈటీ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వెంకటసావిత్రి తెలిపారు. బీపీఈడీ అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు

మదనపల్లె, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజాప్రతినిధులు, నాయకులు క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో భాగంగా స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా, తెలుగు యువత రాష్ట్రఅధ్యక్షుడు జి.శ్రీరాంచినబాబు, జనసేన నేత గంగారపు రామ్‌దాస్‌చౌదరి, శ్రీరామ రామాంజనేయులు, మైనార్టీనేతలు ఎస్‌పి మస్తాన్, పఠాన్ ఖాదర్‌ఖాన్, టీడీపీ సీనియర్ నాయకుడు మార్పూరి సుధాకర్‌నాయుడు, బీజేపీ నేత జబ్బల శ్రీనివాసులు ఉన్నారు. అలాగే తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే జి.శంకర్‌యాదవ్, టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి, కోపూరి మల్లికార్జుననాయుడు క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు.

మానవాళికి ప్రేమతత్వంతో వెలుగులు నింపిన జీసస్

మదనపల్లె అర్బన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి):విశ్వమానవాళికి తన ప్రేమతత్వంతో వెలుగులు పంచిన కరుణామయుడు ఏసుక్రీస్తు అని మదనపల్లె నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎస్‌రెడ్డిసాహెబ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. క్రీస్తు చూపిన మార్గంలో నడవడం ద్వారా మానవాళి సుఖ సంతోషాలతో జీవించడం జరుగుతుందన్నారు.

డిప్యూటీ స్పీకర్‌ను కలిసిన జాన్‌బాబు


డిప్యూటీ స్పీకర్ రఘురామరాజును కలిసిన జాన్‌బాబు, రేచల్‌ప్రమీల

మదనపల్లె అర్బన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి):విజయవాడలో నిర్వహించిన క్రిస్మస్ సంబరాలలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజును బోనాసి జాన్‌బాబు, రేచల్ ప్రమీల మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జాన్‌బాబు మాట్లాడుతూ ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధం గా పాస్టర్లకు గౌరవవేతనం, సమాధుల స్థలం, చర్చినిర్మాణాలుకు అన్ని విధాల అండగా ఉంటున్నారన్నారు. ఈ సందర్భంగా పాస్టర్ల అసోసియేషన్ తరఫున ఆయన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

తేనెటీగల దాడిలో ఇద్దరికి గాయాలు

తంబళ్లపల్లె, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): తేనెటీగలు దాడి చేయడంతో ఇద్దరు రైతులు గాయపడిన సంఘటన మంగళవారం తంబళ్లపల్లె మండలంలో చోటుచేసుకుంది. వివరాల మేరకు..రేణుమాకులపల్లె పంచాయతీ చింపిరెడ్డివారిపల్లెకు చెందిన పెద్దమద్దయ్య (64) మంగళవారం సొంత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంలో కన్నెమడుగుకు వెళ్తుండగా మార్గమధ్యలో తేనెటీగలు చుట్టుముట్టాయి. దీంతో పెద్దమద్దయ్య తీవ్ర అస్వస్థతకు గురై ద్విచక్రవాహనం నుంచి కిందపడిపోయాడు. ఇదే సమయంలో దిగువగాలిగుట్టపల్లెకు చెందిన జయరాంరెడ్డి(65) కన్నెమడుగు బస్టాప్ నుంచి టమోటా వైరు తీసుకుని ఇదే దారిలో వెళుతుండగా ఆయన మీద తేనెటీగలు దాడి చేశాయి. దీంతో జయరాంరెడ్డి కేకలు వేస్తూ పక్కనే ఉన్న గ్రామంలోకి పరిగెత్తగా అక్కడే ఉన్న స్థానికులు పొగ పెట్టి తేనెటీగలను తరిమివేశారు. వెంటనే బాధితులిద్దరినీ ప్రవేటు వాహనంలో తంబళ్లపల్లె సీహెచ్‌సీకి తీసుకువచ్చి అక్కడ ప్రాథమచికిత్స అనంతరం బాధితులకు మెరుగైన వైద్య చికిత్స కోసం 108లో మదనపల్లె జిల్లా వైద్యశాలకు తరలించారు.

మరో ప్రమాదంలో..

మదనపల్లె అర్బన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి):రోడ్డుప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం రామసముద్రం మండలం మినికి చెందిన శంకర(45), గంగాధర్(35)లు కంటి పరీక్షల నిమిత్తం మదనపల్లెకు ద్విచక్రవాహనంపై వస్తుండగా పుంగనూరు రోడ్డు 150మైలు వద్ద కుక్క అడ్డురావడంతో అదుపుతప్పి కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. శంకర్‌కు తలకు గాయం కాగా మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

2న చింతచెట్ల ఫలసాయం కోసం వేలం పాట

మదనపల్లె అర్బన్, డిసెంబరు 24ఆంధ్రజ్యోతి): మదనపల్లె ఆర్ అండ్ బీ పరిధిలోని చింతచెట్ల ఫలసాయాన్ని తీసుకునేందుకు జనవరి 2న వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ ఏఈ బొర్రయ్య తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రామసముద్రం మండలంతోపాటు 16 రీచ్‌లలోని 200పైగా ఉన్న చింతచెట్లకు సంబంధించి వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు మదనపల్లె పట్టణంలోని ఆర్ అండ్ బీ అతిథి భవనంలో నిర్వహించే బహిరంగ వేలంపాటలో పాల్గొనవచ్చన్నారు.

వీఎస్‌రెడ్డికి మంత్రిచే అభినందన

మదనపల్లె టౌన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు చైతన్యం తీసుకురావడం విశేష కృషి చేసిన పేస్ సంస్థ నిర్వాహకుడు వీఎస్‌రెడ్డిని రాష్ట్ర పౌరసరఫ రాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అభినందించారు. మంగళవారం జాతీయ వినియోదారుల దినోత్సవం సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లె కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో వీఎస్ రెడ్డికి సర్టిఫికేట్, జ్ఞాపిక అందజేశారు.

వర్షం వస్తే.. దుస్థితిలో గ్రామీణ రోడ్లు

నిమ్మనపల్లి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): కొద్దిపాటి వర్షమొచ్చినా గ్రామీణప్రాంత రోడ్లు బురదమయంగా మారి ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. నిమ్మనపల్లె మండలంలోని గూడుపల్లి రోడ్డు వర్షానికి బురదమయంగా మారింది. దీంతో జనం రోడ్లపై నడవాలంటేనే హడలిపోతున్నారు. అలాగే కొండయ్యగారిపల్లి పంచాయతిలో వెంకోజిగారిపల్లి మురుగునీటి కాలువలు లేక రోడ్డు పైనే నీరు ప్రవహిస్తుండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. ముష్టూరు పంచాయతీలో అయితే ఇళ్ల మందరే మురుగనీటి కాలువలు ఉన్నా వాటిని శుభ్రం చేయకపోవడంతో వర్షం వస్తే మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తూ వాహనదారులకు, పాదాచారులకు ఇబ్బందకరంగా మారింది. రాచవేటివాటివారిపల్లి గ్రామ పంచాయతిలో కొన్ని గ్రామాలకు అయితే మురుగు నీటి కాలువలు, రోడ్లు సైతం వేయలేదు. అలాగే తవళం, వెంగంవారిపల్లి, రెడ్డివారిపల్లి, బండ్లపై గ్రామ పంచాయతిల్లో కూడా పారిశద్య పనులు చేపట్టకపోవండంతో ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట వేశాయి. అయితే మండల అధికారులు మాత్రం సమస్యలపై ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయిస్తుడంతో తమ గ్రామాలకు రోడ్లు, కాలువలు నిర్మిస్తారని ప్రజలు ఆశగా ఎదరు చూస్తున్నారు.


బరదమయంగా మారిన గూడుపల్లి రోడ్లు

ఆ సంఘమిత్రలకు భరోసా ఇచ్చిందెవరు..?

గుర్రంకొండ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి):ఎన్నికల సమయంలో వైసీపీకి మద్దతుగా పని చేసిన సంఘమిత్రలను తొలగించగా ఇప్పుడు మళ్లీ వారికి భరోసా ఇచ్చి ఎలా నియమిస్తారంటూ కొందరు కూటమి నాయకులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన సుమారు వంద మంది మహిళలు పురుష సంఘమిత్రలను తొలగించి మహిళా సంఘమిత్రలను నియమించాలని రెండు రోజుల క్రితం పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డికి ఫిర్యాదు చేయడంతో అవినీతి సంఘమిత్రలకు భరోసా ఇచ్చిన నాయకులలో అలజడి మొదలైంది. గుర్రంకొండ మండలం మర్రిపాడు పంచాయతీ పరిధిలో ఇద్దరు పురుషులు సంఘమిత్రలుగా పని చేస్తున్నారు. వారిద్దరు ఈ ఏడాది మే నెలలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అప్పటి ఎమ్మెల్యే కుమారుడి వెంట ప్రచారం నిర్వహించారు. ఈ క్రమంలో వారిద్దరు ఎన్నికల నియమావళిని ఉల్లఘించారంటూ జిల్లా అధికారులు సంఘమిత్ర విధుల నుంచి తొలగించారు. దీంతో వైసీపీ కార్యకర్తలా పని చేసిన సంఘమిత్రలు తొలగిపోయారంటూ గ్రూప్ సభ్యులు సంబరపడ్డారు. అంతేకాకుండా కొన్ని నెలల పాటు సంఘమిత్రలు లేకపోవడంతో వెలుగు అధికారులు పక్క గ్రామాల సంఘమిత్రాలకు బాధ్యతలను అప్పగించారు. ఈ క్రమంలో విధుల నుంచి తొలగించబడిన సంఘమిత్రలు కూటమి ప్రభుత్వంలోని కొందరు నాయకులను కలిసి సంఘమిత్రలుగా కొన్ని నెలలకే విధుల్లో చేరారు. దీంతో గ్రూప్ సభ్యులను ఇబ్బందిపెడుతున్న వారిని ఎలా నియమించారని గ్రామంలో చర్చజరుగుతోంది. ఈ క్రమంలో విసిగిపోయిన గ్రూప్ సభ్యులు అవినీతికి పాల్పడుతున్న సంఘమిత్రలను తొలగించాలని, మర్రిపాడు సంఘమిత్రలుగా మహిళలను నియమించాలని సోమవారం పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిని కలికిరిలో కలిసి తమ గోడును వెలిబుచ్చారు. మర్రిపాడు గ్రామానికి చెందిన గ్రూప్ సభ్యులు ఎమ్మెల్యేను కలవడంతో సంఘమిత్రలు కొనసాగుతారా?...లేక విధుల నుంచి మరోమారు తొలగిస్తారా? అన్న చర్చ గ్రామంలో చక్కర్లుకొడుతుంది.

పార్కుల నిర్వహణ పక్కాగా చేయండి


మున్సిపల్ మేనేజర్ పి.ఆర్.మనోహర్‌కు వినతి పత్రం ఇస్తున్న బీవైఎస్ నాయకులు

మదనపల్లె, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మున్సిపాలిటీలో వివిధ ప్రాంతాల్లో నిరుపయోగంగా ఉన్న పార్కులను వినియోగంలోకి తీసుకురావాలని బహుజన యువసేన(బీవైస్) అధ్యక్షుడు పునీత్‌కుమార్ మున్సిపల్ మేనేజర్ పి.ఆర్.మనోహర్‌ను కోరారు. వాటి నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో అవి పాడుపడిపోయి వినియోగంలో లేక అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారినట్లు ఆయన ఆరోపించారు. పట్టణ ప్రజలకు సాయంత్రం వేళ కాస్త ఆహ్లాదకరమైన, ప్రశాంతమైన వాతావరణం కల్పించడానికి ఉద్దేశించిన ఈ పార్కులు అందుకు పనికిరాకుండాపోయినట్లు ఆయన మేనేజర్‌కు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. ఇందులో రామ్‌నగర్‌పార్కు, రామారావుకాలనీ, బాపూజీపార్కు, తదితర ఏరియాలలోని వాటిపై చర్యలు తీసుకోవాలని పునీత్‌కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో బీవైఎస్ నాయకులు శ్రీనివాసులు, ఆది, శశికుమార్, వినయ్, శివకుమార్, తారక్, ఉదయ్, జగదీష్ పాల్గొన్నారు.

గోకులాల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి

తంబళ్లపల్లె, డిసెంబరు 24: ఉపాధి హామీలో భాగంగా ప్రభుత్వం నుంచి మంజూరైన గోకు లం షెడ్ల నిర్మాణాలను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా లబ్దిదారులకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి ఆదేశించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీల వారీగా చేపట్టిన ఉపాధి పనుల వివరాలు, చేపట్టాల్సిన పనులపై చర్చించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ..గ్రామాల్లో జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పనులు కల్పించి కూలీల సంఖ్య పెంచడానికి కృషి చేయాలన్నారు. మండలంలో 47 గోకులం షెడ్లు మంజూరవ్వగా అన్నీ షెడ్లు నిర్మాణాలు ప్రారంభమైనట్లు తెలిపారు. ఇందులో 3 గోకులాలు ఇప్పటికే పూర్తవ్వగా, 15 రూఫ్ లెవల్‌లో ఉన్నట్లు తెలిపారు. మిగిలిన గోకులం షెడ్లు సంక్రాంతికి పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో అంజినప్ప, డ్వామా డీబీటీ మేనేజర్ మహేంద్రమణి, ఇంజనీర్ ఉపాధి ఇంజనీర్ రామన్న, టీఏలు శంకర, శేఖరమ్మ, వెంకట్రమణ, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అంతర్జాతీయ టోర్నీకి కురబలకోట పీడీ ఎంపిక

కురబలకోట, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురబలకోట జడ్పీహైస్కూల్‌కు చెందిన పీడీ అంతర్జాతీయస్థాయిలో జరిగే టోర్నీకి రెఫరీగా ఎంపికయ్యారు. పాఠశాలలో పీడీగా పని చేస్తున్న బాలాజీ నాయక్ తమిళనాడులోని హోసూరు అదియమాన్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంటర్నేషనల్ త్రోబాల్ ఛాంపియన్‌షిప్-2024ను నిర్వహిస్తున్నారు. ఈ నెల 28నుంచి ప్రారంభం కానున్న టోర్నీకి దేశ,విదేశాలకు జట్లు పాల్గొంటాయి. ఈ టోర్నీకి ఆయనను రెఫరీగా ఎంపిక చేశారు. ఎంపికైన ఆయనను ఎంఈవో ద్వారకనాథ్ తదితరులు అభినందించారు.


టోర్నీకి రెఫరీగా ఎంపికైన పీడీ బాలాజీ

ఎంపీలను కలిసిన జబ్బల శ్రీనివాసులు

మదనపల్లె, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మదనపల్లె బీజేపీ నేత, కురబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు, రాజ్యసభ ఎంపీలు ఆర్.కృష్ణయ్య, బీద మస్తాన్‌లను కలిశారు. హైదరాబాద్‌లోని వారి నివాసాల్లో మంగళవారం మర్యాద పూర్వకంగా కలసి సత్కరించారు. ఇందులోభాగంగా జబ్బల శ్రీనివాసులు భారతీయ జనతాపార్టీలో చేరిన సందర్భంగా పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పార్టీ అభివృద్ధికి తీసుకోవాల్సిన భవిష్యత్తు అంశాలపై చర్చించారు.

పాతకక్షలతో దాడి..ముగ్గురిపై కేసు నమోదు

నిమ్మనపల్లి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పాతకక్షలను మనసులో ఉంచుకొని వ్యక్తిపై దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ చక్రవర్తి తెలిపారు. మండలంలోని జంగంపల్లికి చెందిన అశోక్ నిమ్మనపల్లిలోని ఒక శుభకార్యక్రమానికి వెళ్లి వస్తుండగా అదే గ్రామానికి చెందిన గధం రామానాయుడు, రమేష్, అలివేలమ్మలు పాతకక్షలను దృష్టిలో పెట్టుకొని తనను కొట్టినట్లు ఫిర్యాదు చేశాడన్నారు. అశోక్ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు హెచ్‌సీ తెలిపారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర

మదనపల్లె టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూకు సంబంధించిన సమస్యలు త్వరితగతిన పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని చీకిలబైలులో సర్పంచ్ ప్రభాకర్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పాసుపుస్తకాల మంజూరు, వన్‌బీ అడంగల్ పరిష్కరించాలని ప్రజలు కోరారు. వెంకటమ్మచెరువు స్థలం కబ్జాకు గురైందని, దేవుని మాన్యాల భూమి రికార్డుల్లో ఎక్కించాలని కోరారు. మొత్తం 46 మంది పలు సమస్యలపై అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీవో అమరనాథరెడ్డి, ఎంపీడీవో తాజ్‌మస్రూర్, తహసీల్దార్ ఖాజాబి, డీటీ అస్లాంబాషా, తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: భూ సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని తహసీల్దారు హరికుమార్ పేర్కొన్నారు. మంగళవారం పంచాలమర్రిలో రెవెన్యూ సదస్సులో రైతులు, ప్రజల నుంచి 7 వినతులు వచ్చినట్లు తెలిపారు.ప్రజల కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారి జోగేంద్ర, డిటీ రవినాయక్, ఆర్‌ఐ ముద్దుక్రిష్ణయాదవ్, ఎఫ్‌బీవో రామరాజు, దేవదాయ శాఖ సిబ్బంది కొండకిట్ట, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవు

నిమ్మనపల్లి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ ధనంజేయులు హెచ్చరించారు. మంగళవారం నిమ్మనపల్లి గ్రామపంచాయతి వారపుసంతలో రెవెన్యూ సదస్సులు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే ఎంతటివారైనాగాని చట్టరీత్యా చర్యలు తీసుకొంటామని తెలిపారు. అలాగే డీకేటీ భూములను కొనడం, అమ్మడం చేయరాదని ఒక వేల పట్టాదారునికి అవసరము లేకపోలే ప్రభుత్వమే వాటిని స్వాధీనం చేసుకొంటుదని తెలిపారు. ఇప్పటి వరకు జరిగిన రెవెన్యూ సదస్సులలో 347 అర్జీలు వచ్చాయని ప్రతి అర్జీకి సంబంధించి 45రోజులలో పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రీసర్వే తప్పిదాలపై ఆందోళన చెందవద్దు

గుర్రంకొండ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి):రీసర్వే తప్పిదాలపై రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని తహశీల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని సరిమడుగు గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో రైతుల భూముల వివరాలు తప్పిదంగా నమోదైన విషయం వాస్తవమేనన్నారు. ఈ రీసర్వే తప్పిదాలపై జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాల మేరకు రైతులకు న్యాయం చేస్తామన్నారు. అనంతరం రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి లక్ష్మీపతి, సర్పంచ్ రామలక్ష్మమ్మ, నాయకులు మేకల చలపతి, పుల్లయ్య, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో: భూ సమస్యలు పరిష్కరించుకోవడానికి రైతుల్లో చైతన్యం రావాలని పెద్దమండ్యం నోడల్ అధికారి, జిల్లా హౌసింగ్ పీడీ సాంబశివ పేర్కొన్నారు. మండలంలోని సి..గొల్లపల్లిలో మంగళవారం రైతు సదస్సులో పీడీ మాట్లాడుతూ రైతు సదస్సు గురించి గ్రామాల్లోని గ్రామ సచివాలయ సిబ్బంది, రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజల నుంచి సదస్సుల్లో వచ్చిన అర్జీలు పరిష్కరిస్తామని తెలిపారు. తహసీల్దార్ సయ్యద్ అహ్మద్, సర్పంచ్ విశ్వనాథరెడ్డి, ఆర్‌ఐ రమేష్, మండల సర్వేయర్ హసీన్‌తాజ్, కూటమి నేతలు కుంటకిందపల్లి చంద్రారెడ్డి, రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళితుల ఆధీనంలోని స్థలాల్లో పట్టాలివ్వాలి

ములకలచెరువు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): బురకాయలకోట పంచాయతీ పెద్దమొరవపల్లెలో దళితులు ఆధీనంలో ఉన్న స్థలాన్ని వారికే ఇంటి పట్టాలు మంజూరు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం దళిత హక్కుల పోరాట సమితి, సీపీఐ, బాస్ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మంచాల హరికుమార్, సీపీఐ మండల కార్యదర్శి అంజనప్ప, బాస్ నేత మంత్రాల రమణ మాట్లాడుతూ బురకాయలకోట పంచాయతీ పెద్దమొరవపల్లెలో దళితులు ఆధీనంలో ఉన్న స్థలాన్ని ఇతర కులస్థులు ఆక్రమించాలని చూస్తూ దళితులపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర, రెడ్డెప్ప పాల్గొన్నారు.

వాల్మీకిపురం ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్‌గా రవికుమార్

వాల్మీకిపురం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం ప్రభుత్వ వైద్యశాల నూతన సూపరింటెండెంట్‌గా డాక్టర్ రవికుమార్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ ఫైరోజాబేగం డీఎంహెచ్‌వోగా పదోన్నతిపై సత్యసాయి జిల్లాకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో స్థానికంగా విధులు నిర్వహిస్తున్న సివిల్ సర్జన్ డాక్టర్ రవికుమార్ సూపరింటెండెంట్ బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ ఎల్లవేళలా వైద్య సేవలు అందించడమే ధ్యేయంగా కృషి చేస్తామన్నారు. అంతేకాకుండా స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ఎంతో మెరుగైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అత్యాధునిక ప్రమాణాలతో వైద్యసదుపాయాలు ప్రజలకు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ఆస్పత్రి వైద్యులు, సిబ్బందితో సమావేశమై చర్చించారు. వైద్యులు, సిబ్బంది విధుల విషయంలో నిర్లక్ష్యం వహించక బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు.



డీలర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

పీలేరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పీలేరు మండలంలో ఖాళీగా ఉన్న చౌక దుకాణాల డీలర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తహసీల్దారు భీమేశ్వరరావు తెలిపారు. పీలేరు పట్టణంలోని అజంతా టాకీసు రోడ్డు(ఎస్సీ), లక్ష్మీపురం(ఓసీ), రైల్వేగేటు వీధి(ఈడబ్ల్యూఎస్), బ్రాహ్మణ వీధి(బీసీ-బీ), పాలావారివీధి(ఓసీ), దొడ్డిపల్లె పంచాయతీలోని బెస్తపల్లె(బీసీ-ఈ), రేగళ్ల పంచాయతీలోని నగరి(బీసీ-ఏ,మహిళ), వేపులబైలు పంచాయతీలోని గాయం వారిపల్లె(ఎస్సీ), బండమీదహరిజనవాడ(ఓసీ), తలపుల పంచాయతీ మల్లేశ్వర పురం(ఓసీ) చౌకదుకాణాలు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆయా చౌకదుకాణాలు లేక పంచాయతీల పరిధిలోని ఇంటర్ ఉత్తీర్ణులైన 18 నుంచి 40 ఏళ్లలోపు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులను జిల్లా అధికారిక పోర్టల్ అయిన అన్నమయ్య.ఏపీ.జీవోవీ.ఇన్ లింక్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులను ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు పీలేరు తహసీల్దారు కార్యాలయంలో అందజేయాలన్నారు. దరఖాస్తుదారులకు రాత పరీక్ష వచ్చే ఏడాది జనవరి 7వ తేదీన జరుగుతుందన్నారు. రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఆ తరువాత ప్రక్రియ వ్యక్తిగతంగా తెలియజేస్తామన్నారు.

వాల్మీకుల సమస్యలన్నింటిని పరిష్కరిస్తాం

● ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి


ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిని కలిసిన వాల్మీకి సంఘ నాయకులు, సభ్యులు

వాల్మీకిపురం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పీలేరు నియోజకవర్గంలో ఉన్న వాల్మీకుల సమస్యలన్నింటినీ తప్పక పరిష్కరిస్తానని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల వాల్మీకి సేవాసమితి ఆధ్వర్యంలో ఆ సంఘ నాయకులు, సభ్యులు తదితరులు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ మండలంలోని విఠలం గ్రామ పంచాయతీ కుందేళ్లవారిపల్లెకు దారి సమస్యతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఎంతో ప్రాముఖ్యం వాల్మీకిపురంలో పొందిన వాల్మీకి మహర్షి విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని, పట్టణంలో బీసీ-ఏలకు కేటాయించిన ప్రభుత్వ చౌక దుకాణం వాల్మీకులకు ఇస్తూ వారి అభివృద్ధికి సహకరించాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే కిశోర్‌కు మార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి సమస్యనూ తప్పక పరిష్కరించడమే కాకుండా వాల్మీకు ల అభివృద్ధికి తప్పక కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం అధ్యక్షుడు విష్ణు చైతన్య, సెక్రటరీ భరత్‌కుమార్, కోశాధికారి రమేష్, సభ్యులు, వాల్మీకి కులస్తులు పాల్గొన్నారు.

దారి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే చొరవ


చిప్పిలిలో దారిసమస్యపై అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం చిప్పిలి గ్రామంలో పదేళ్లుగా ఉన్న దారి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చొరవ తీసుకున్నారు. మంగళవారం చిప్పిలి గ్రామం బంగారుకొత్తపేటకు చెందిన ప్రజలు తమ కాలనీకి దారి సమస్యపై ఎమ్మెల్యేను కల సి సమస్య విన్నవించారు. ఓ వ్యక్తి డీకేటీ భూమిలో ఇంటి నివాసం చేసుకోవడంతో అక్కడ కాలనీకి వెళ్లే దారి సమస్య వచ్చి నట్లు ప్రజలు చెప్పారు. దీంతో ఎమ్మెల్యే స్వయంగా అక్కడికి వెళ్లి పరిశీలించారు. అనంతరం ఈ విషయమై రెవెన్యూ అధికారులను పిలిపించి రెవెన్యూ రికార్డులు పరిశీలించి కాలనీ ప్రజలకు దారి సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. కాలనీలో మురుగునీటి కాలువ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని పంచాయతీరాజ్‌శాఖ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ శేషాద్రిరావు, టీడీపీ నాయకులు గురునాథ్ యాదవ్, జంగాల రమణ, మధుసూధన్‌రెడ్డి, డాన్స్‌రెడ్డెప్ప, వినోద్, వాసు, వినోద్, నయాజ్, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో కార్మికులకు మౌలిక వసతులు కల్పించాలి


మార్కెట్‌యార్డులో సమావేశమైన టీఎన్‌టీయూసీ నాయకులు

మదనపల్లె టౌన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మదనపల్లె టమోటా మార్కెట్‌లో కార్మికులు(హమాలీ)లకు మౌలిక వసతులు కల్పించాలని టీఎన్‌టీయూసీ గౌరవ అధ్యక్షుడు ఎండీ గౌస్, సలహాదారుడు ఎం.నాగయ్య పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మార్కెట్‌యార్డులో టీఎన్‌టీయూసీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు వి.ఖాసీమ్ మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా హమాలీలకు కూలి పెంచేలా చర్యలు తీసుకోవాలని, ఈ విషయం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా దృష్టికి తీసుకెళతామన్నారు. హమాలీలను ప్రభుత్వం నాలుగో తరగతి వేతన కార్మికులుగా గుర్తించాలని ఇన్సూరెన్స్ ప్రీమియంను ప్రభుత్వమే భరించాలని కోరారు. ఇళ్ల స్థలాలు లేని కార్మికులకు ఇంటి పట్టాలు మంజూరుకు ప్రయత్నిస్తామన్నారు. మార్కెట్‌లో హమాలీలకు విశ్రాంతి భవనం, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం కల్పించేలా అధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి షామీర్‌రెహమాన్, ఉపాధ్యక్షులు రామయ్య, హమీద్ బాషా, కార్యదర్శి షబ్బీర్, కోశాధికారి ఖుర్షీద్‌రెహమాన్, సభ్యులు సాదిక్, షమీర్, సుబ్బరాయుడు, అక్కులప్ప, సురేంద్ర పాల్గొన్నారు.

‘కుల దహనం’ విజయవంతం చేయండి

● బాస్ అధినేత పీటీఎం శివప్రసాద్ పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న బాస్ అధినేత పీటీఎం శివప్రసాద్

మదనపల్లె, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): భారతీయ అంబేడ్కర్ సేన(బాస్) 13వ వార్షికోత్సవాల్లో భాగంగా ఈనెల 29న (ఆదివారం) మదనపల్లెలో నిర్వహిస్తున్న కుల దహనం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బాస్‌నేతలు పిలుపునిచ్చారు. స్థానిక బాస్ కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర స్థాయినేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న పీటీఎం శివప్రసాద్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సమస్యను వ్యూహాత్మకంగా జఠిలం చేసి, అంబేడ్కర్ కుల నిర్మూలన ఉద్యమాన్ని బీజేపీ తిరోగమనం వైపు మళ్లించిందన్నారు. కుల నిర్మూలన ఉద్యమాన్ని తిరిగి పురోగమనం బాటలోకి మళ్లించడానికే బాస్ కుల నిర్మూలన ఉద్యమాన్ని చేపట్టిందన్నారు. ఇందులోభాగంగానే కుల దహనం పేరుతో కుల నిర్మూలన చైతన్య సభలను నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. బాస్‌శ్రేణులతోపాటు కుల నిర్మూలన కోరుకునే వారందరూ ఈ సభకు స్వచ్ఛందంగా వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజాకవి పోతబోలు రెడ్డెప్ప, బాస్‌స్టేట్ కన్వీనర్ ఉలగనాధన్ గణపతి, రాష్ట్ర కార్యదర్శులు కె.వి.రమణ, పల్ల తాతయ్య, రాష్ట్ర కమిటీ సభులు వి.దొరస్వామి, నీరుగట్టి రమణతోపాటు చిత్తూరు జిల్లా కో-కన్వీనర్ వినోద్‌కుమార్, అన్నమయ్య జిల్లా నాయకుడు సి.బయన్న, పి.రవిశంకర్, బి.రెడ్డిప్రసాద్, జనార్దన్, ఇర్ఫాన్, సి.రెడ్డెప్ప, తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలకు కస్తూరిబా విద్యార్థులు

●కిట్లు వితరణ చేసిన టీడీపీ నేత కట్టా దొరస్వామినాయుడు


విద్యార్థులకు కిట్లను అందజేస్తున్న సీఐ లక్ష్మన్న, టీడీపీ నేతలు

ములకలచెరువు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ పోటీలలో పాల్గొంటున్న ములకలచెరువు కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు పాల్గొంటున్నారు. దీంతో టీఎన్ఎస్సీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత కట్టా దొరస్వామినాయుడు వారికి సహాయంగా కిట్లు వితరణ చేశారు. ఈ మేరకు స్థానిక పాఠశాలలో మంగళవారం సీఐ లక్ష్మన్న, టీడీపీ నేత కట్టా దొరస్వామినాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు పాలగిరి సిద్ధాలు విద్యార్థులు రేఖ, ఐశ్వర్యలకు కిట్లను పంపిణీ చేశారు. అలాగే ఇటీవల ఈ విద్యార్థులకు టీడీపీ నేత కట్టా దొరస్వామినాయుడు, ఆయన స్నేహితులు రూ.15వేలు నగదు కూడా అందజేశారు. ఈ నెల 26 నుంచి 29వతేదీ వరకు కల్‌కత్తాలో జరగనున్న అంతర్జాతీయ పోటీలతో పాటు సెలక్షన్స్‌లో విద్యార్థులు ఇద్దరూ పాల్గొననున్నారు. కార్యక్రమంలో లోకేశ్ యువసేన వ్యవస్థాపకుడు కంచెర్ల చింటు, కురబలకోట మండల తెలుగు యువత అధ్యక్షుడు షేక్ నజీబ్, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, నాయీ బ్రహ్మణ సెల్ జిల్లా నాయకుడు చింతకుంట్ల కేశవులు, నేతలు సోమశేఖర్, సుధాకర్‌నాయుడు, ప్రతాప్‌నాయుడు, రెడ్డెప్ప పాల్గొన్నారు.

పంటల సాగుకు ఈకేవైసీ తప్పనిసరి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తదితరులు

వాల్మీకిపురం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పంటలు సాగు చేసిన ప్రతి రైతు తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రానాయక్ సూచించారు. మంగళవారం వాల్మీకిపురం మండలంలోని చింతపర్తి రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి, టమోటా, మామిడి సాగు చేసిన రైతులు కూడా పంట బీమా ప్రీమియం కట్టుకోవాలని తెలియజేశారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం ప్రతి మంగళవారం, బుధవారం నిర్వహించడం జరుగుతోందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారిణి హేమలత, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.